CARE
Super Speciality
Dental Hospital
- అత్యంత అధునాతన లేజర్ పరికరంతో చిగుళ్ల వ్యాధికి ప్రత్యేక చికిత్స.
- 7గురు స్పెషలిస్టు డాక్టర్లు కలిగిన ఏకైక సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల.
- రాష్ట్ర ప్రభుత్వ, APSPDCL(విద్యుత్),SHAR ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబసభ్యులకు రీయంబర్స్‌మెంట్ సదుపాయం కలదు.
Dr. A. Swaroop Kumar Reddy
Professor in Endodontics
Pogathota, Nellore. Ph: 2303300

Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షయ

సంపుటి: 83 • సంచిక: 28 • 12-7-2013 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

Hotel
D.S.R
Paradise

Function Hall
- Fully Airconditioned
- 250 seating capacity
- L.E.D lighting
- Ample car parking
అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

నిర్ణయం ఏదైనా... జరిగేది ధ్వంసమే!

తెలంగాణపై ఒక నిర్ణయానికి రావడానికి కాంగ్రెస్ పార్టీ కోర్ కమిటీ రేపు (12తేది) ప్రత్యేక సమావేశం జరపబోతున్నది. ఈ పత్రిక పాఠకులకందే సరికి ఆ నిర్ణయం ఏమిటో తెలిసిపోతుంది. అయితే కాంగ్రెస్ పెద్దలు నిజంగానే ఒక నిర్ణయానికి వస్తారా, లేక మరొక కుంటిసాకు చూపించి వాయిదా వేస్తారా అన్నది అనుమానం. తెలంగాణపై నిర్ణయం తీసుకోవడం అంత సులభం కాదు. అందులో జాతీయ స్థాయిలో ముడిపడిన క్లిష్ట సమస్యలు చాలానే వున్నాయి. మిత్రపక్షాల అభ్యంతరాలూ వున్నాయి. కానీ నవంబర్ లోపల మధ్యంతర ఎన్నికలకు సిద్ధపడుతున్న సోనియాగాంధీ ఆంధ్ర రాష్ట్రంలో రాజకీయ ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఈ సాహసం తలపెట్టారు. వైఎస్‌జగన్ ప్రభావం వల్ల రాష్ట్రంలో నిర్వీర్యమైపోయిన కాంగ్రెస్‌ను పునరుజ్జీవింప చేయడానికి ఇంతకంటే మంచి అస్త్రం వారికి కన్పించడం లేదు. తెలంగాణ, అందులోనూ రాయల తెలంగాణ ఇస్తే జగన్‌ను రెండు రాష్ట్రాలలో దెబ్బ తీయవచ్చు. తెలంగాణలో కొంతలో కొంత కాంగ్రెస్ సీట్ల సంఖ్య పెంచుకోవచ్చు అన్నది ఆశ. అయితే కేవలం తెలంగాణ భావనతోనే ఓటర్లు ముందుకు వస్తారా లేక కరెంట్ కోతలు, పెరిగిన ధరలు, ప్రభుత్వం మీద ద్వేషం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొంటారా అన్నదానిపై స్పష్టత లేదు. ఈ రెండోది జరిగితే కాంగ్రెస్‌కు భ్రష్టత్వం తప్ప ప్రయోజనం అంటూ మిగలదు. అయితే గోదావరిలో మునిగే వాడికి గడ్డి పరక కూడా తెప్ప మాదిరి కన్పించడం సహజం. కాంగ్రెస్ నేతల పరిస్థితి అదే ఇప్పుడు.

పిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రుల నుంచి నివేదికలు కోరడం కేవలం కంటినీటి తుడుపు మాత్రమే. వారిచ్చే నివేదికలకు కోర్ కమిటీలో పూచిక పుల్ల విలువ వుండదు. వారు చెప్పే అంశాలన్నీ అధిష్టానం వద్ద ఎప్పటి నుంచో వున్నాయి. దిగ్విజయ్ సింగ్ ఆంధ్ర పరిశీలకుడిగా వచ్చిన తర్వాత తెలంగాణ అంశం వేగాన్ని సంతరించుకొన్నది. ఆయనకు చిదంబరం అండ వుంది. హోంమంత్రి, ప్రధాన మంత్రులు దీనికి వ్యతిరేకం. అయితే సోనియా ఒక నిర్ణయానికి వస్తే వారెవ్వరూ ఎదురు చెప్పరు, చెప్పలేరు కూడా.

హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా తెలంగాణ ఇవ్వడం; లేకుంటే హైదరాబాద్ సహితంగా రాయల తెలంగాణ ఇవ్వడం అనే రెండు ప్రతిపాదనల మీదనే సోనియా దృష్టి పెడుతున్నట్లు వినికిడి. నిర్ణయం అంటూ జరిగితే ఈ రెండింటిలో ఒకదాన్ని ప్రకటించవచ్చు. ఈ రూపంలో తప్ప పూర్తిగా కెసిఆర్ కోరుకొన్నట్లు ప్రత్యేక తెలంగాణ ఇవ్వకపో

కొరవ 14వ పేజీలో

మార్గాలు నాలుగు!

- **సమైక్యంగా కొనసాగించడం.**
- **హైదరాబాద్ సహితంగా తెలంగాణ ఇవ్వడం.**
- **హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా రెండు రాష్ట్రాల ఏర్పాటు.**
- **కర్నూలు, అనంతపురం జిల్లాలు కలిపి రాయల తెలంగాణ.**

సమైక్యంతో సమస్య తెగదు

రాష్ట్రాన్ని సమైక్యంగా కొనసాగిస్తే అరవై ఏళ్ల తెలంగాణ ఉద్యమానికి ముగింపు వీలు కాదు. ఆ రావణ కాష్టం అట్లనే కాలుతూ వుంటుంది. తెలంగాణ వాంఛ రాజకీయ నేతల వ్యూహాలకు పరిమితం కాదు. ఆ ప్రాంతం ప్రజల మనసులలో గాఢంగా గూడు కట్టుకొని వుంది. కోట్లాది ప్రజల మనోభీష్టానికి విరుద్ధంగా ఎంతోకాలం సమస్యను నాన్చలేరు. ఇప్పటివరకు తెలంగాణ ఉద్యమం ప్రజాస్వామిక పద్ధతులలో నడుస్తున్నది. పరిష్కారం చెప్పకుండా దాటవేస్తే అరాచకవాదుల చేతులలోకి వెళ్లే ప్రమాదం వుంది. అది ఉభయ ప్రాంతాలకూ మంచిది కాదు.

హైదరాబాద్ సహిత తెలంగాణ

తెలంగాణ వాదులందరూ కోరుకొనేది – హైదరాబాద్ సహితంగా ప్రత్యేక రాష్ట్రం. హైదరాబాద్ నగరాన్ని, తెలంగాణను విడదీయడం వీలుకాని పని అన్నది వారి వాదన. తెలంగాణ తొమ్మిది జిల్లాలు హైదరాబాద్ నగరానికి చుట్టూ పరచుకొని వున్నాయి. ఆంధ్ర ప్రాంతం నుంచి ఇక్కడకు రావాలంటే ఏదో ఒక తెలంగాణ జిల్లాను దాటుకొని రావాల్సిందే. అందువల్ల రెండు రాష్ట్రాలకు ఒకే రాజధాని భౌగోళికంగా అసంజసం అన్నది వాదన. పైపెచ్చు హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసింది నిజాం పాలకులు. విశాలాంధ్ర ఏర్పడే వరకు హైదరాబాద్ నగరంతో ఆంధ్ర ప్రాంతానికి ఎటువంటి సంపర్కం లేదు. అక్కడ నుంచి ఇక్కడకు పెద్దగా రాకపోకలు కానీ, బంధుత్వ బంధాలు కానీ వుండేవి కావు. అందువల్లనే తెలంగాణ, ఆంధ్ర సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, భాషలోని మాండలికాలలో సారూప్యం నెలకొనకుండా దేనికది స్వతంత్ర ప్రతిపత్తి కాపాడుకొన్నది. రాష్ట్ర రాజధానిగా మారిన తర్వాత కూడా చాలాకాలం పాటు ఆంధ్రులు హైదరాబాద్ పట్ల ఆసక్తి చూపలేదు.

కొరవ 14వ పేజీలో

కుల సమీకరణలు మారిపోతాయి

తెలంగాణ ఏర్పాటు వల్ల కలిగే ప్రధాన రాజకీయ పరిణామం – కుల సమీకరణలలో వచ్చే మార్పు. ఇప్పటివరకు ఆంధ్ర రాజకీయాలలో రెడ్డి, కమ్మ కులాలకే ప్రాధాన్యత లభిస్తున్నది. జలగం వెంగళరావు, పివి నరసింహారావు, దామోదరం సంజీవయ్య వంటి వారు ముఖ్యమంత్రులు కాగల్గింది కాంగ్రెస్ జాతీయ పార్టీ కావడం వల్లనే. ఇప్పటి వరకు సమైక్యాంధ్ర రాష్ట్రాన్ని 16 మంది ముఖ్యమంత్రులు పాలించారు. అందులో తొమ్మిది మంది – నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, భవనం వెంకట్రామ్, టంగుటూరి అంజయ్య, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి రెడ్లు. ముగ్గురు – ఎన్టీఆర్, నాదెండ్ల భాస్కర్‌రావు, నారా చంద్రబాబునాయుడు కమ్మ. జలగం, రోశయ్య, పివి, దామోదరం సంజీవయ్యలు మాత్రమే ఇతర కులాలకు చెందిన వారు.

రాష్ట్రంలోని కర్నూలు, కడప, నెల్లూరు, ఒం

కొరవ 14వ పేజీలో


శ్రద్ధాంజలి
మంచితనం, ఆప్యాయత, అనురాగం మూర్తీభవించిన మంచి మనిషి
శ్రీ పాపకన్ను శశిధర్‌రెడ్డి గారు
మరణం మాకు తీరనిలోటు.
వారి ప్రవిత్రాత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.
మామ - అత్త:
కూరపాటి ప్రభాకర్‌రెడ్డి - ప్రభావతి
బావమరిది - చెల్లెలు:
కూరపాటి సుందరరామిరెడ్డి - శ్రీలత
USA USA
కోడళ్లు:
కూరపాటి సంజన, కూరపాటి స్వయన
వాడా రాజగోపాల్‌రెడ్డి - డాక్టర్ సుహాసిని
Rtd.Highcourt Judge
కీ॥శే॥ పాపకన్ను శశిధర్‌రెడ్డి గారు
జనవం : 16-5-1971 మరణం : 08-07-2013

సంచలన తీర్పు

సమయము, నేరస్తుల నిలయంగా మారిపోయిన భారత రాజకీయాలను క్షాళన చేసే సంచలనాత్మక తీర్పు వెలువరించింది సుప్రీంకోర్టు. ఏ న్యాయస్థానంలోనైనా సరే, రెండేళ్లకు పైబడిన జైలు శిక్ష విధించపడిన నేరస్తులు, ఆ తీర్పు వెలువడిన మరుక్షణం నుంచే రాజకీయ పదవులకు అర్హత కోల్పోతారని తీర్పు చెప్పింది అత్యున్నత న్యాయస్థానం. 1951 నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం రెండేళ్లకు పైబడిన జైలు శిక్ష విధింపబడిన వారు ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులు. అయితే క్రింది కోర్టు విధించిన శిక్షపై పైకోర్టుకు అప్పీల్ చేసుకొన్నప్పుడు, ఆ కేసు పరిష్కారమయ్యే వరకు ఈ అనర్హత వర్తించదు. చట్టంలోని ఈ లోపాన్ని ఆసరాగా తీసుకొని ఇంతకాలం నేరస్తులు తమ ఇష్టారాజ్యాంగా అటు నేర జీవితాన్ని, ఇటు రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ఎంత పెద్ద నేరంలో శిక్ష పడినా పై కోర్టుకు అప్పీల్ సాకుతో నిక్షేపంగా ఎన్నికలలో పోటీ చేసి, ఎమ్మెల్యేలుగా, ఎమ్పీలుగా పదవీ భోగం అనుభవిస్తున్నారు. మన న్యాయస్థానాలలో కేసుల పరిష్కారానికి జరిగే ఆలస్యం వీరి పాలిట వరంగా మారుతూ వచ్చింది ఇంతకాలం. జిల్లా కోర్టు శిక్ష విధించినా హైకోర్టు, సుప్రీంకోర్టు అప్పీళ్లలో పాతికేళ్ల పాటు తుది తీర్పు వెలువడకుండా చూసుకొని, తమ జీవిత పర్యంతం చట్టాన్ని తప్పించుక తిరిగిన వారు ఎందరో వున్నారు. ఇటువంటి వారందరికీ ఈనాటి సుప్రీంకోర్టు తీర్పు శూలం పోటు వలె తగులుతున్నది.

జమీన్‌రైతు

భారతదేశంలో నేరస్తులు రాజకీయాలలోకి ప్రవేశించడం 1980 దశకం నుంచి ప్రారంభమైంది. ప్రాంతీయ పార్టీలు, స్థానికంగా బలం కల్గిన నేతలు తమ తమ రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థితి నెలకొనడం వల్ల కల్గిన అనర్థం ఇది. మొదటగా ప్రాంతీయ పార్టీలు నాంది పలికిన ఈ జాఢ్యాన్ని ఆ తర్వాత కాంగ్రెస్, బిజెపి వంటి జాతీయ పార్టీలు కూడా అక్కున చేర్చుకొన్నాయి. రౌడీ, గూండా, హంతకుడు, బ్యాంకులను ముంచినవాడు, ప్రజలను మోసగించినవాడు, మాజీ మావోయిస్టులు, స్మగ్లర్లు వంటి వారికి రాజకీయాలు నిరపాయకరమైన ఆశ్రయంగా మారిపోయాయి. పంచాయితీల నుంచి పార్లమెంట్ వరకు ఎవరి స్థాయిని బట్టి వారు ఆక్రమించుకోవడం మొదలు పెట్టారు. ఇప్పటి లోక్‌సభలో నాలుగవ వంతు సభ్యుల మీద నేరారోపణలు, వివిధ కోర్టులలో కేసులున్నాయంటే పరిస్థితి ఎంతగా దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఈ వికృత పోకడకు ఒక భయానక ఉదాహరణ – మహమ్మద్ షాబుద్దీన్. 1986లో మొదటి హత్య చేశాడతను. అప్పటి నుంచి హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు అతడి జీవన శైలిగా మారిపోయాయి. అతడి మీద ఇప్పుడు 8 హత్య కేసులు, 27 హత్యా ప్రయత్నాలు, దాదాపు 30 కిడ్నాప్ కేసులు నడుస్తున్నాయి. కానీ 1990 నుంచి 2009 వరకు షాబుద్దీన్ రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఆరుసార్లు ఎమ్పీగా గెలిచాడు. 2009 ఎన్నికల నాటికి అతడికి ఒక స్థానిక కోర్టు జీవిత కాల శిక్ష విధించడంతో, విధిలేక ఏ రాజకీయ పార్టీ టిక్కెట్ ఇవ్వలేదు. 2004 ఎన్నికలలో షాబుద్దీన్ విచారణ ఖైదీగా జైలు నుంచే పోటీ చేసి, ఎమ్పీగా గెలిచాడు. జైలు నుంచి విడుదల కాగానే, ఆ ఎన్నికలలో అతడికి వ్యతిరేకంగా పని చేసిన 8 మంది ప్రత్యర్థి పార్టీ రాజకీయ కార్యకర్తలను చంపించి వేశాడట. ఇంతటి కరడు కట్టిన నేరస్తుడిని కేంద్రం హోంశాఖ సహాయ మంత్రిగా నియమించాడు ఆనాటి ప్రధాని దేవగౌడ. ఆర్‌జెడి అధినేత లల్లూ ప్రసాద్ యాదవ్ ఆశ్రయమే షాబుద్దీన్ నేరజీవితానికి, రాజకీయ సోపానానికి కారణం. రాజూభయ్యా, పప్పు యాదవ్, తస్లీముద్దీన్, శిబూ సోరేన్, ఓంప్రకాష్ చౌతాలా, పూలన్‌దేవి, నీలో హిత దాసన్ నాడార్ వంటి వారంతా ఈ కోవకు చెందిన వారే.

ఈ దుర్మార్గ పోకడకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రతిపాదన చేసింది. ఐదేళ్లకు పైబడిన జైలు శిక్ష విధించే అవకాశం వున్న నేరాలకు పాల్పడి, కోర్టులలో ఛార్జిషీట్ నమోదు చేసిన వారెవరూ ఎన్నికలలో పోటీ చేయకుండా నిరోధించాలని ఒక "చట్టసవరణ" ప్రతిపాదించింది. కానీ లోక్‌సభలో పాతిక భాగం సభ్యులు నేరస్తులే కాబట్టి ఆ ప్రతిపాదన ఆమోదం కాకుండా అడ్డుకొన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో ఇటువంటి నేరస్తుల విచ్చలవిడికి కొంతలో కొంత అడ్డుకట్ట పడబోతున్నది. నేరమయమై పోయిన దేశ రాజకీయాలను క్షాళన చేయడానికి కొంతలో కొంత ఉపకరించే సంచలనాత్మక తీర్పు ఇది.

మన రాష్ట్రానికి సంబంధించి వైఎస్‌జగన్‌కు ఇది శరాఘాతం వంటి తీర్పు. ఆయనపై మోపిన నేరారోపణలన్నీ ఐదేళ్లకు పైబడిన శిక్షకు ఆస్కారం వున్నవే. ఈ కేసులలో ఏ ఒక్కదానిలో ఎన్నికల లోపల శిక్ష ఖరారైతే, ఇక జగన్ శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా వుండిపోక తప్పదు.

జనవాణి

ఈ మార్కులు ఎలా సాధ్యం?

ఈసారి ఇంటర్ స్టేట్‌ఫస్ట్‌తోపాటు టాపర్స్ అందరికీ వచ్చిన మార్కులు చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తోంది. విద్యార్థులకు మార్కుల పంట పండడం ఆనందించతగ్గ విషయమే అయినప్పటికీ కొన్ని ప్రాథమిక సందేహాలు తలెత్తుతున్నాయి. ఇవి రాస్తే వచ్చిన మార్కులు కాదు. వేస్తే వచ్చిన మార్కుల్లా అనిపిస్తోంది. పూర్వం ఇంటర్‌లో ఒకేసారి పాసవడం అంటే అదో ఘనవిజయం. అసలు సగం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడమే గగనం. గత పది పన్నెండేళ్ల నుంచి ఇంటర్ పరీక్షా ఫలితాలలో చాలా మార్కులు వచ్చేశాయి. ప్రైవేటు, కార్పొరేటు కళాశాలల హవా మొదలైన తర్వాత పరీక్షల విధానంతోపాటు ఫలితాలు కూడా వారి చేతుల్లోకి వెళ్లి పోయినట్లు కనిపిస్తోంది. గణితం వంటి సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులు రావడం సహజమే. కానీ ఇంగ్లీషు, తెలుగు లాంటి భాషల్లోనూ 99 మార్కులు రావడం ఎలా సాధ్యం? ఎమ్పీసి విభాగంలో 970– 944 మార్కుల మధ్య కొన్ని వేల మంది విద్యార్థులు టాప్ స్థాయిలో నిలిచారు. అసలిది నిజంగా సాధ్యమా? ఈ వ్యవహారంపై ఇంటర్ బోర్డు వివరణ ఇవ్వాలి.

పి.అరుణకుమారి — నెల్లూరు

మంచి కలెక్టర్

నెల్లూరు కలెక్టర్‌గా రెండేళ్ల పనిచేసి గతవారంలో బదలీ అయిన బి.శ్రీధర్‌రెడ్డి జిల్లాలో నిజాయితీగా పనిచేసిన కలెక్టర్లలో ఒకరుగా చెప్పుకోవాలి. ముందు సౌమ్యంగానే పని చేసిన ఆయన తర్వాత ఉద్యోగులను పని తీరు మార్చుకోమని గట్టిగా హెచ్చరికలు చేస్తూ వారిలో మార్పుకు ప్రయత్నించారు. పేద విద్యార్థుల కోసం ఆయన ప్రవేశపెట్టిన సరస్వతి నిధి. స్వీకారం పథకాలు ఎంతగానో ఉపకరించాయి. గత ఏడాది ధాన్యం ధరలు పడిపోయిన సమయంలో ఆయన ప్రభుత్వంతో మాట్లాడి లక్షా 75టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయించి రైతులకు అండగా నిలబడ్డారు. అధికారపార్టీ నాయకులకు తొత్తుగా వ్యవహరించకుండా స్వతంత్రంగా పని చేశారు. ఈ యేడాది కావలి డివిజన్‌లో మొదటి కారు పంట ఎండిపోకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకొన్నారు. కొత్త కలెక్టర్ శ్రీకాంత్ కూడా ఆయన బాటలో నడిస్తే మంచి పేరు తెచ్చుకోగలరు.

జడగోగుల వెంకటరత్నం — కావలి

ఇదేమి న్యాయం!

సెక్యులరిజం పేరుతో కేంద్రంలోని యూపిఏ ప్రభుత్వం, రాష్ట్రంలోని కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఇస్లాం అజెండాను అమలు చేస్తున్నట్లు కొన్ని విషయాల ద్వారా తేటతెల్లమవుతుంది. ముస్లిం విద్యార్థులకు మాత్రమే ఉపకార వేతనాలు

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

16-7-1943
పేజీలు : 4 వెల: 0-1-6

పల్లెటూళ్లు

బాలిరెడ్డిపాళెం ఘోష

పైరు పంటలు పోయి, కూటికి, గుడ్డకు కరువై, ఈ కరువులో ఎట్లా బ్రతికేది దేముడా అని అఘోరిస్తూ ఉంటే తహశీల్దారు మంది మార్బలంతో వచ్చి కూర్చొని శిస్తులు తోపుడు లేదు అని రాజాగారు బలవంతంగా వసూలు చేయమన్నారని చెప్పి శిస్తు మాత్రం వసూలు చేశారు. దివాన్ పేష్కారు అరవ అయ్యంగారు వచ్చి రైతుల మీద కరణాలు దావాలకు పంపలేదని కొంచెంసేపు దబాయించి 43 సపోటా పండ్లతో ఆత్మ చల్లబడి పోయినాడు. వీరు ఎంతమందిని దబాయించినా కొడవలూరు లక్ష్మీనరసారెడ్డిని మాత్రం ఎవరుగానీ అడిగి శిస్తులు వసూలు చేసిన పాపాన పోలేదు. ఆయన మంచి నిమ్మ పండ్ల దాతండి.

తూపిలి చెరువు

మొన్న రోహిణి కార్తెలో కురిసిన వర్షాలకు అన్నీ చెరువులు నిండితే తూపిలి చెర్వుగారు పాతిక చెరువు గూడా కాలేదు. ఆ కొంచెము నీళ్లు బందోబస్తు చేసుకొని ముందుగా నార్లు నాటుకొందామా అనుకొంటే ఆ ఓటి కట్టలోని పాత ఎండ్రకాయ బొక్కల గుండా పగిలిపోయిన తొర్రి తూముల గుండా ఆ కాసిని నీళ్లు గూడా "నదీనాం సాగరే గతిః" అన్నట్లు సముద్రానికి పలాయనం చిత్తగించాయి. రాజాగారితో చెరువు బాగుచేయండయ్యా అంటే ఇదిగో 30వేలు శాంక్షన్ చేశానంటారు. గవర్నమెంటుకు అర్జీ పెట్టుకుంటే ఆ అర్జీయే అంతులేదు. దిక్కులేని ఊరికి నక్క తలారి అన్నట్లు ఎవరితో చెప్పుకొని ఏడవనురా దైవమా?

50 ఏళ్ల క్రితం ఈవారం

12-7-1963
పేజీలు: 12 వెల: 0-20 న.పై

250 పంచాయితీలు రద్దు కాగలవా?

1964 ఏప్రెల్‌లో జరుగబోయే ఎన్నికల కొరకు నెల్లూరు జిల్లాలో పంచాయితీల పునర్వ్యవస్థీకరణ జరుగుతున్నది. ప్రస్తుతం జిల్లాలో 1054 పంచాయితీలున్నవని; వెయ్యి జనాభాగానీ లేక రూ.1000ల ఆదాయం గానీ అనే కొత్త సూత్రం వల్ల వీటిలో దాదాపు 250 పంచాయితీలు రద్దు కావచ్చునని తెలుస్తున్నది. ఆదాయం వసూలైన మొత్తమును బట్టిగాక, డిమాండును బట్టి పరిగణించబడాలనే తాజా ఉత్తర్వును బట్టి రద్దయ్యే పంచాయితీల సంఖ్య కొద్దిగా తగ్గవచ్చు.

ఆచార్య రంగా విసుర్లు

నెల్లూరు జిల్లా స్వతంత్ర పార్టీ సర్వసభ్య సమావేశం సందర్భంలో గత 30వ తేది కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆవరణలో సభ జరిగింది. జిల్లా స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు పెల్లేటి వెంకట కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు.

సభలో అఖిల భారత స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు ఆచార్య రంగా, బాపట్ల తాలుకా కార్యదర్శి ఎం.రామమూర్తి, పెళ్లకూరు రామచంద్రారెడ్డి గారలు ఉపన్యసించారు.

ఆచార్య రంగా కాంగ్రెస్ మీద, కాంగ్రెస్ ప్రభుత్వాల మీద, ప్రధాని నెహ్రూ మీద నిశితమైన విమర్శలు గావించారు. పైకి కమ్యూనిస్టులతో కలసినందు వల్ల తమ పరువు ప్రతిష్టలు గంగపాలైన వంటూనే కాంగ్రెస్ వారు కమ్యూనిస్టులతో చేతులు కలుపుతున్నారన్నారు.

నెల్లూరు ముచ్చట్లు

ముక్తసరి మాటల కలెక్టర్!

జిల్లా కలెక్టర్ నాగులపల్లి శ్రీకాంత్ తనను కలవను వివిధ పనుల మీద వెళ్లిన వారితో ముక్తసరిగా మాట్లాడుతున్నారట. ఒకటిన్నర నిమిషం లేదంటే రెండు నిమిషాల్లో ఆయన భేటీ ముగిస్తుండడంతో సందర్శకులు అసంతృప్తికి లోనవుతున్నారు. అధికారవర్గంలోనూ ఈ వ్యవహారమై చర్చ జరుగుతుంది.

ఎస్పీలో దాగిన రచయిత!

కొత్త ఎస్పీ సివిఎస్ రామకృష్ణ నిశ్శబ్దంగా తన విధులు తాను నిర్వహిస్తున్నారు. బంగ్లాలోనికి సందర్శకులను అనుమతిస్తుండడంతో ఫిర్యాదుదారులు ఆయన్ను సులభంగానే కలవగలుగుతున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పత్రికల్లో వస్తున్న వార్తలను ఎస్పీ ప్రస్తావిస్తూ తనలో కూడా మంచి రచయిత ఉన్నాడని కలం పేరుతో పోలీసు శాఖ నిర్వహించే మ్యాగ్‌జైన్‌లలో విస్తృతంగా తాను వ్రాసిన వార్తలను 8వ తేది విలేకరుల సమావేశంలో ప్రస్తావించారాయన. పాత ఎస్పీలు ఈశ్వరరెడ్డి, శివధర్‌రెడ్డి కూడా మంచి రచయితలుగా పేరుగాంచారు. విస్తృత సర్వీసు, రచయిత హృదయం కావడం వల్ల ఎస్పీ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించగలరని ఆశిద్దాం.

కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి!

తరగకుండానే ఎరగడ్డలు కన్నీరు తెప్పిస్తున్నాయి. గడచిన వారం రోజుల వ్యవధిలో కిలో ఎరగడ్డల ధర 20 రూపాయల నుంచి 30 రూపాయలయ్యాయి. ఈ ధరకు కూడా పచ్చి సరకు దొరుకుతుండడం బాధాకరం.

పంచాయితీ ఎన్నికల పరిశీలనకు రవిచంద్ర!

జిల్లాలో ఈ నెలలో జరుగనున్న పంచాయితీ ఎన్నికల సాధారణ పరిశీలకులుగా ముద్దాడ రవిచంద్ర, భారతీ నాయక్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వ్యయ పరిశీలకునిగా మరో సీనియర్ ఐఏఎస్ అధికారి సిన్హా నియమితులయ్యారు. రవిచంద్ర గతంలో నెల్లూరు కలెక్టర్‌గా పనిచేసిన అనుభవమున్న అధికారి.

రంజాన్ నెల మొదలు

ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ నెల 10వ తేది చంద్రవంక కనపడడంతో మొదలయ్యింది. ఎప్పుడూలేనట్లుగా రంజాన్ పండుగ ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీలు 8వతేది గోల్డన్ జూబ్లీహాల్‌లో సమీక్షా సమావేశం జరిపారు. మసీదులు, ఈద్గాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు పారిశుద్ధ్యం పరిస్థితులు మెరుగు పర్చాలని అధికారులకు సూచించారు. ముస్లింలకు చక్కెర, గోధుమలు, బియ్యంతోపాటు గ్యాస్ సిలిండర్లను అదనంగా ఇవ్వాలని పౌరసరఫరాల శాఖాధికారులను ఆదేశించారు. ముస్లింలు నివసించే ప్రాంతాల్లో అంగళ్లు రాత్రి 11 గంటల వరకు తెరిచినా అభ్యంతరం లేదని ఉత్తర్వులిస్తామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్వో రామిరెడ్డి, నగరంలోని వివిధ మసీదుల ఇమాంలు, ముతవల్లీలు, పేష్‌మామ్‌లు పాల్గొన్నారు.

అరకొర నిధులు!

పంచాయితీ ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం 8 కోట్ల రూపాయలు విడుదల చేయమని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా 8వ తేది నాలుగు కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ మొత్తం చాలదంటున్నారు జిల్లా పంచాయితీ శాఖాధికారులు. ఎన్నికల విధుల్లోకి ఉద్యోగులకు టిఏ, డిఏలే రెండు కోట్ల 50 లక్షల రూపాయలవుతాయి. బ్యాలెట్ పత్రాల ముద్రణ మొదలుకొని సకల సబ్బండు ఖర్చులకు కోటీ 50 లక్షల రూపాయలు చాలవన్నది అధికారుల సణుగుడు. మరి ఈ సమస్య ఏవిధంగా పరిష్కారమవుతుందో చూడాలి.

కాంగ్రెస్ కుటిల నీతి!

ఎన్నికల్లో మనుగడ కోసమే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజనకు ప్రయత్నం చేస్తుందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. 8వ తేది జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణపై కేంద్రం మాట్లాడడం లేదు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వాస్తవంగా వెనుకబడింది కోస్తా ప్రాంతం. కోస్తా ప్రజలను హైదరాబాద్‌లో ఆస్తులు అమ్ముకొని వెళ్లిపొమ్మని ఎలా అంటారని చంద్రమోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు.

ట్రాఫిక్ నడత చూసిన ఎస్పీ!

నెల్లూరు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సివిఎస్ రామకృష్ణ 5వ తేది నగరంలో కలియ తిరిగి ట్రాఫిక్ నడతను చూశారు. కెవిఆర్ పెట్రోల్ బంక్, ఆర్టీసి, మద్రాస్ బస్టాండ్, విఆర్‌సి, గాంధీబొమ్మ, ట్రంకురోడ్డు, నర్తకి సెంటర్, బోసుబొమ్మ, ఆత్మకూరు బస్టాండు కూడళ్లలో కాసేపు నిలబడి నగర ట్రాఫిక్ నడతను అర్థం చేసుకొన్నారు. ఎస్పీ వెంట నగర డిఎస్పీ వెంకటనాధ్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐలు సురేష్ కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డిలు వున్నారు.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ్ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పొగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

కలెక్టరేట్‌లో సినిమా షూటింగ్!

నెల్లూరు కలక్టరేట్‌లో ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు రామానుజన్ జీవిత ఆధారంగా తీస్తున్న చిత్రం షూటింగ్ 5వ తేది జరిగింది. రామానుజన్ నెల్లూరు కలక్టరేట్‌లో 104 ఏళ్ల క్రితం పనిచేశారు. ఆయన్ను అప్పటి కలెక్టర్ సి.రామచంద్ర రావు ప్రోత్సహించారు. ఈ ఘట్టాలనే కలక్టరేట్ క్రింది గదుల్లో చిత్రీకరించారు. ఈ గదులు ఇంకా పాత తరహాలోనే ఉండడం వల్ల షూటింగుకు బాగా ఉపయోగపడ్డాయి.

931 పంచాయితీలకు ఎన్నికలు!



జిల్లాలో మూడు విడతలుగా ఈ నెల 23, 27, 31 తేదీల్లో 931 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరపను జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ నాగులపల్లి శ్రీకాంత్ చెప్పారు. 9వ తేది సాయంత్రం గోల్డన్‌జూబ్లీ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ మొదట విడత ఎన్నికలు జరిగే పంచాయితీల్లో నామినేషన్ల ఘట్టం మొదలయ్యిందన్నారు. మొదట విడత ఎన్నికలు 21వ తేది 360 పంచాయితీల్లో, రెండవ విడత ఎన్నికలు 27వ తేది 234 పంచాయితీల్లో, మూడవ విడత ఎన్నికలు 31వ తేదీ 337 పంచాయితీల్లో జరుగుతాయని, 13 లక్షల 93 వేల 997 మంది ఓటర్లు ఓటు వేయను అర్హులన్నారు. జిల్లాలో ఎన్నికలు ఆపమని ఎవరూ కోర్టుకు వెళ్లనందున 931 పంచాయితీల్లో నిరభ్యంతరంగా ఎన్నికలుంటాయన్నారు. ఓటువేయను ప్రభుత్వం గుర్తించిన 22 గుర్తింపు పత్రాలు ఓటర్లు పోలింగ్ అధికారులకు చూపించవచ్చన్నారు. 341 గ్రామ పంచాయితీలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, ఇక్కడ పోలీసు బందోబస్తు, వెబ్ కెమెరాలుంటాయన్నారు. ఎన్నికల కోసం 12వేల మంది సిబ్బంది, మరో 500 మంది మైక్రో పరిశీలకులను పెట్టామన్నారు. ఎస్పీ సివిఎస్ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పంచాయితీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. పంచాయితీల వేలం పాటలు, దురాయిల మీద వచ్చే ఫిర్యాదులను పరిశీలిస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో జెసి లక్ష్మీకాంతం, ఎజెసి, ఇన్‌ఛార్జ్ పంచాయితీ ఎన్నికల అధికారి కూడా అయిన పెంచలరెడ్డి కూడా పాల్గొన్నారు.

మంటల్లో పోలీస్ ఎస్కార్ట్ వాహనం!

మాజీ మావోయిస్టు గంటి ప్రసాదం నెల్లూరు నారాయణ జనరల్ హాస్పిటల్‌లో మరణించిన సమయంలోనే నెల్లూరు పోలీసు ఆఫీసులో పార్కింగ్ చేసి ఉండిన ఎస్కార్ట్ వాహనం కాలిపోవడంపై అలజడి రేగింది. కానీ ఈ వాహనంలోని బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో రేగిన మంటల వల్ల ఇది జరిగిందని విచారణలో తేలడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్తరాఖండ్ బాధితులకు విరాళం!

ఉత్తరాఖండ్ వరద బాధితులకు నెల్లూరు తెలుగుదేశం పార్టీ బిసి సెల్ నేత నూనె మల్లిఖార్జున్ యాదవ్ పది వేల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆయన తెలుగుదేశం పార్టీ సర్వాధినేత నారా చంద్రబాబునాయుడును హైదరాబాద్‌లో కలసి అందించారు.

వెంగమాంబ హుండీ ఆదాయం పెరిగింది!

మెట్ట ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత నర్రవాడ వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. దేశంలో వివిధ చోట్ల స్థిరపడిన ఉదయగిరి ప్రాంతీయులంతా ఈ ఉత్సవాలకు ప్రత్యేకంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ హుండీకి ఆదాయంగా 39.21 లక్షల రూపాయలొచ్చాయి. ఈ మొత్తంలో 25,64,780 హుండీలో పడగా, దర్శనం టిక్కెట్లు అమ్మకం ద్వారా 13,23,435 రూపాయలు,

కొరవ 14వ పేజీలో

LAND FOR SALE

పాదలకూరు - సంగం

రోడ్డు ప్రక్కన 40 ఎకరముల

పట్టా పొలము

అమ్మకమునకు కలదు.

DRIP, Bores, Solar Fencing

నీటి వసతి కలదు.

: సంప్రదించండి :

98483 30344, 098404 21999

వజ్రం - బంగారం - వెండి

ఫ్యాక్టరీ అవుట్‌లెట్

BIS 916 హాల్‌మార్క్

బంగారు ఆభరణములపై*

తరుగు 6% నుండి - కూలి లేదు.

వెండి వస్తువులపై*

తరుగులేదు - కూలిలేదు.

డైమండ్స్‌పై 10% తగ్గింపు*

*T&C Apply

గోల్డ్ ప్యాలెస్

ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,

జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.

ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్

925 STERLING SILVER*

EXPORT QUALITY

వెండి వస్తువులపై*

తరుగు లేదు, కూలి లేదు.

*T&C Apply

సిల్వర్ ప్లాజా

EXCLUSIVE SILVER SHOW ROOM

(A Unit of Gold Palace)

ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,

జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.

ఫోన్: 2331132, 2331121



బంద్ సందర్భంగా ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు.

పోటాపోటీగా విద్యార్థి సంఘాల బంద్‌లు!

ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

విద్యార్థి సంఘాలు పోటీపడి బంద్‌లు నిర్వహిస్తుండడంతో విద్యా సంస్థలు పునఃప్రారంభమైన కొద్ది కాలంలోనే రెండు రోజులకోసారి మూత పడుతున్నాయి. విద్యార్థుల సమస్యల మీద, ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపైనా విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేయడం, ఆందోళన చేపట్టడం, బంద్‌లు నిర్వహించడం సాధారణం. విద్యార్థి సంఘాల మధ్య ఆధిపత్య ధోరణి పెరగడం, ఒకరిపై ఒకరికి పోటీ నెలకొనడంతో ఆ ప్రభావం వారు చేపట్టే కార్యక్రమాలపై పడుతోంది. ఫలితంగా విద్యాసంస్థలు మూసివేస్తుండడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల ఒక వారం వ్యవధిలో రోజు మార్చి రోజు బంద్‌లు చేపట్టాయి విద్యార్థి సంఘాలు. ఫీజులు పెంచడాన్ని నిరసిస్తూ ఒక రోజు, గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు చేపట్టాలని మరొక రోజు, సమైక్యాంధ్ర విద్యార్థి జెఎసిపై బిజెపి నాయకులు దాడులు చేయడాన్ని నిరసిస్తూ ఇంకొక రోజు ఇలా రకరకాలుగా పలు విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్‌లకు పిలుపునిస్తుండడంతో ఆదిలోనే హంసపాదన్నట్లు పాఠశాలలు, కళాశాలలు తెరచిన కొద్ది రోజులకే వరుసబెట్టి సెలవులు వస్తుండడంతో విద్యార్థులు, తల్లితండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నారు. నిజంగా విద్యార్థి సమస్యలపై పోరాడితే విద్యార్థి సంఘాలకు అన్ని వర్గాల మద్దతు లభిస్తుంది. అలా కాకుండా తమ స్వార్థం కోసం, విద్యాసంస్థల యాజమాన్యాల నుంచి డబ్బులు దండుకోవాలన్న దుర్బుద్ధితో కొన్ని విద్యార్థి సంఘాలు అడ్డదారులు తొక్కడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



అటుకులు చిటుకులు మారుతున్నారు!

మళ్లీ కాంగ్రెస్‌లో చేరనున్న కర్తం ప్రతాప్‌రెడ్డి

అటుకులు చిటుకులు మారండోయ్ అని చిన్న పిల్లలు ఆటలాడుతున్నట్లు రాజకీయ నేతలు పార్టీలు మారుతున్నారు. ఒక పార్టీలో వుండడం కొత్తగా పార్టీ పెడితే వెళ్లడం, ఎంత స్పీడ్‌గా వెళ్లారో అంతే స్పీడ్‌గా వెనక్కు వచ్చేయడం జరిగింది. దీన్ని నిజం చేస్తూ తూర్పు ప్రాంతంలో తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పరచుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు పాఠశాలను నిర్వహిస్తున్న కర్తం ప్రతాప్‌రెడ్డి మళ్లీ పార్టీ మారాడు. యువజన కాంగ్రెస్ నేతగా, ఆనం వివేకానందరెడ్డి అనుచరుడిగా వున్న ప్రతాప్ ఎందువల్లనో ఉన్నట్లుండి వైఎస్ జగన్ పార్టీలో చేరాడు. అనుచరులతో ఆడంబరంగా కొత్త పార్టీ తీర్థం పుచ్చుకొన్న ఆయన మేకపాటి రాజమోహన్‌రెడ్డి వర్గంలో కొనసాగాడు. నగరంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో నియోజకవర్గ సమన్వయకర్త పోలుబోయిన అనిల్‌కు, ప్రతాప్‌కు మొదటి నుంచి పొసగేదికాదు. గత ఉప ఎన్నికల సమయంలో రూప్‌కుమార్‌కు, ప్రతాప్‌రెడ్డికి వివాదం ఏర్పడి అది తారాస్థాయికి వెళ్లింది. అక్కడే వున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు దీన్ని సర్దబెట్టారు. అప్పటి నుంచి తనను అనిల్ పట్టించుకోవడం లేదని, తనకు పోటీగా ఇతరులను ప్రోత్సహిస్తున్నాడని పలు సందర్భాలలో అసంతృప్తి వ్యక్తం చేశాడు. తిరిగి ఏమైందో, ఏమి జరిగిందో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని, అనిల్ వైఖరి కారణంగానే విసిగిపోయి ఈ నిర్ణయం తీసుకొంటున్నట్లు విలేకరుల సమావేశం పెట్టి విమర్శలు చేశాడు. మంచి రోజు చూసుకొని వివేకా చెంతకు వెళ్లేందుకు వురవుర లాడుతున్నాడట ప్రతాప్‌రెడ్డి. ఆయన లాగే సతీష్‌యాదవ్ అనే నాయకుడు కూడా వైకాపాకు రాజీనామాచేసి తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరాడు.

వైకాపాలో గొడవ... గొడవ!

గూడూరు సమన్వయకర్తల సవాళ్లు



సమావేశంలో గొడవను సర్దుబాటు చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలోని వర్గపోరు మరోమారు బట్టబయలైంది. ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే, పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న బాలినేని వాసు సమక్షంలోనే నేతలు బాహాబాహీకి సిద్ధపడ్డారు. నువ్వెంత అంటే నువ్వెంత అనుకోవడం, చిటికేస్తే వంద మంది వస్తారని సవాళ్లు విసురు కోవడం, ఒకరి ఒకరు దాడి చేసుకొనేంత వరకు వెళ్లడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. మినీబైపాస్ రోడ్డులోగల జిపిఆర్ కళ్యాణ మండపంలో పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ మేరిగ మురళితోపాటు వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు పాల్గొన్నారు. గూడూరుకు సంబంధించి పాశం సునీల్ వర్గనేత మాజీ ఎమ్పీపి విజయకుమార్ ప్రసంగం ప్రారంభించగానే గొడవ రేగింది. ఆయన తన నియోజకవర్గ సమన్వయకర్త బాలచెన్నయ్యను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. దీంతో సభలో గందరగోళం నెలకొనింది. రెండు వర్గాలకు చెందిన నేతలు, అనుచరుల అరుపులు కేకలతో సమావేశం రసాభాస అయ్యింది. దీనికి ప్రతిస్పందనగా బాలచెన్నయ్య మాట్లాడుతూ చేసిన విమర్శలు అగ్నికి ఆజ్యం పోసినట్లవడంతో ఇరువర్గాలు కలబడే స్థాయికి వచ్చాయి. గత కొంతకాలంగా బాలచెన్నయ్య, సునీల్ మధ్య వర్గ పోరు నడుస్తోంది. అది ఈ సమావేశంలో తారాస్థాయికి చేరుకొంది. ఈ ఘటనతో ముఖ్య అతిథిగా వచ్చిన బాలినేని వాసు ఘాటుగానే స్పందించారు. పిచ్చి పిచ్చి వేషాలువేసి విబేధాలు పెంచాలనుకొంటే సహించేది లేదు. ఇలాగే గొడవలు చేస్తే మీ ఇద్దరిని ప్రక్కనపెట్టి మరో వ్యక్తికి బాధ్యతలు అప్పగిస్తామని బాలచెన్నయ్య, పాశం సునీల్‌ను ఉద్దేశించి తీవ్ర హెచ్చరికలు చేశారు.

గ్రామాల్లో బసకు ఉత్తర్వులు!

కలెక్టర్ పల్లెబాట

సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు తీరు, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు గ్రామాల్లో బస చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన అధికారులు ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల్లో బస చేయాల్సి వుంటుంది. వారంలో ఒకటి లేదా రెండు రోజులు ఏదో ఒక గ్రామానికి వెళ్లాల్సి వుంటుంది. రాత్రిపూట గ్రామస్తులతో సమావేశమై స్థానిక సమస్యలతోపాటు సంక్షేమ పథకాలు ఏవిధంగా అమలవుతున్నాయన్న దానిపై వివరాలు అడిగి తెలుసుకోవాలి. ఉపాధి హామీ పథకం, అమృత హస్తం, అమ్మ హస్తం, ఉచిత విద్యుత్తు, పెన్షన్ల పంపిణీ తదితర పథకాలపై సమాచారాన్ని సేకరిస్తారు. జిల్లా కలెక్టర్‌తోపాటు సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు గ్రామాల్లో బస చేయక తప్పదు. గత ఐదు సంవత్సరాల క్రితం ప్రతి శనివారం జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు సంక్షేమ శాఖల వసతి గృహాల్లో తనిఖీలుచేసి అక్కడ బస చేసేవారు. ఏ సమయంలో ఏ ప్రాంతానికి వెళ్లేది రహస్యంగా వుంచేవారు. దీంతో మండలస్థాయిలో అధికారులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించేవారు. జిల్లా కలెక్టర్లు మారడంతో గ్రామాల్లో రాత్రి బస కార్యక్రమం అటకెక్కింది. తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీచేసిన ఆదేశాలతో గ్రామాలకు వెళ్లే అవకాశం ఏర్పడింది. జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎన్.శ్రీకాంత్ ఏ మండలంలో ఏ గ్రామంలో రాత్రి బస చేస్తారో వేచి చూడాలి.

సమీక్షల బాటన కలెక్టర్!

● అధికారులను పరుగులు తీయిస్తున్నాడు



జిల్లా అధికారులతో సమీక్షలో కలెక్టర్ శ్రీకాంత్.

జిల్లా కలెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ తన పని తనం ఎంత వేగంగా వుంటుందో అధికారగణానికి తెలియ జెప్తున్నారు. బాధ్యతలు చేపట్టగానే పలు ప్రాంతాలలో వివిధ విభాగాల పనితీరును పరిశీలించి లోటుపాట్లను ఎత్తి చూపుతూ సుతిమెత్తగా హెచ్చరిస్తూ, అవసరమైనచోట కఠినంగా వ్యవహరిస్తున్నాడు. మనుబోలుకు వెళ్లిన ఆయన అక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యసేవలు, మందుల నిర్వహణపై కలెక్టర్ వేసిన ప్రశ్నలకు వైద్యాధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. అక్కడ పని చేసే యుడిసి సుబ్బారావు విధులకు సక్రమంగా హాజరు కావడంలేదని తెలుసుకొని అతడిని సస్పెండ్ చేశారు. దీంతో కలెక్టర్ మొట్టమొదటి వేటు వేసినట్లయ్యింది. అక్కడ నుంచి జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. బోగోలు, కావలి తదితర ప్రాంతాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులు జరిగే తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంచాయితీ ఎన్నికలపైనా జిల్లా కేంద్రంలో అధికారులతో సమీక్ష జరిపారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, బ్రాడ్‌బాండ్, విద్యుత్ కనెక్షన్లపై ఆరా తీశారు. కలెక్టర్ స్పీడ్ చూసి సిబ్బంది ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ముందు ముందు ఎలా వుంటుందో చూడాలి.

● నవోదయ ఫలితాల్లో

నేతాజి పైలెట్ హైస్కూల్ మేవా!

సీట్లు సాధించిన 23 మంది

కృష్ణాపురంలోని జవహర్ నవోదయ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో నెల్లూరు విజయమహల్ గేటు వద్దగల శ్రీ నేతాజి పైలెట్ హైస్కూల్‌లో శిక్షణ పొందిన విద్యార్థుల్లో 23 మంది సీట్లు సాధించారు. వీరిలో ఆర్.పవన్, డి.దివ్య, ఎ.సాయిశ్రీ, కె.లావణ్య, ఎం.ప్రవీణ్‌కుమార్, సి.హెచ్.శ్రీలేఖ, వై.కౌటిల్య, ఎం.జీవన్‌మిత్ర, పి.రమ్య, గురునాధ్, పి.సుమతి, జె.సుజీవన, ఎం.మణికంఠ, కె.శ్రీవల్లి, వి.ఈశ్వర్, జి.చైతన్య, ఎన్.సాయిహర్షిత, కె.సాయిశ్రీహర్ష, జి.సోనిప్రియ, పి.లోకేశ్వరరెడ్డి, ఎ.దినేష్, ఎం.కళ్యాణ్ రెడ్డి, ఎ.రుషి ఉన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను స్కూల్ కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, స్కూల్ హెడ్ మాస్టర్ ఎన్.ప్రసన్న అభినందించారు.

కాంగ్రెస్‌వి క్షుద్ర రాజకీయాలు!



కావలిలో బివి రాఘవులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసం క్షుద్ర రాజకీయాలు చేస్తున్నాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బివి రాఘవులు తీవ్ర విమర్శలు చేశారు. లోక్‌సభలో సీట్లే లక్ష్యంగా రాష్ట్ర భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. జవహర్ భారతి కళాశాలలో నిర్వహించిన సదస్సులో పాల్గొనేందుకు ఇటీవల కావలి వచ్చిన ఆయన రాష్ట్ర రాజకీయాలపై విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వచ్చిన దిగ్విజయ్‌సింగ్ తెలంగాణ వారికి ప్రత్యేక రాష్ట్రం వస్తుందని చెపుతూ, అదే సమయంలో సీమాంధ్రులకు రాష్ట్రం సమైక్యంగానే వుంటుందంటూ ఇరు ప్రాంతాల వారిని దగా చేస్తున్నాడని విమర్శించారు. కేంద్ర రాష్ట్రాలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరు వల్ల భ్రష్టు పట్టి పోయాయని, అన్ని రంగాల్లో వెనుకబడి పోయాయన్నారు. పెరిగిన, ధరలతో సతమతమవుతున్న ప్రజలు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని సాగనంపాలని నిర్ణయించుకొన్నారన్నారు. తెలంగాణ ఇచ్చినా ఇవ్వకున్నా కేంద్ర రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. చార్‌ధామ్ యాత్రలో వేలాది మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోతే రాష్ట్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కేంద్రం ఆలస్యంగా స్పందించిదన్నారు. కుర్చీలు కాపాడుకొనే పనిలో నేతలు బిజీగా వున్నారని చురకలు అంటించారు. 2014 ఎన్నికల్లో జాతీయస్థాయి పొత్తులను అనుసరించి రాష్ట్రంలో తగిన నిర్ణయం తీసుకొంటామన్నారు.

● రాష్ట్ర గిడ్డంగుల శాఖ

డైరక్టర్‌గా కర్రెద్దుల రమేష్!



రమేష్‌కు స్వాగతం పలుకుతున్న బోగోలు కాంగ్రెస్ నాయకులు.

బోగోలు మండల కాంగ్రెస్ నేత విశ్వనాధరావుపేటకు చెందిన కర్రెద్దుల రమేష్‌కు రాష్ట్ర గిడ్డంగులశాఖ డైరెక్టర్ పదవి లభించింది. ఈ మేరకు సిఎం కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు రమేష్ తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు గత నలభైఏళ్లుగా శక్తివంచన లేకుండా కృషి చేశానని, 13 ఏళ్లుగా మండల కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్‌గా పని చేస్తున్నారన్నారు. తాను చేసిన సేవలను గుర్తించి, తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పితాని సత్యనారాయణ, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రమేష్‌కు గిడ్డంగులశాఖ డైరెక్టర్ పదవి లభించడం పట్ల బోగోలు కాంగ్రెస్ నాయకులు సన్మాన కార్యక్రమం చేపట్టారు. రైల్వే కమిటి సభ్యుడు బొడ్డు మురళీమోహన్‌రెడ్డి అధ్యర్యంలో జరిగిన సన్మానసభలో లక్కాకుల మాధవరావు, ఫ్యాక్స్ శ్రీను, రామచంద్రారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పంచాయితీ ఎన్నికలు!

జిల్లా కలెక్టర్ భరోసా

త్వరలో జరుగనున్న పంచాయితీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ చెప్పారు. కావలి ఆర్డీఓ కార్యాలయంలో పంచాయితీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నిర్వహిస్తుండిన శిక్షణా తరగతులను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా పటిష్టంగా ఎన్నికలను జరిపేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ పూర్తి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ బోగోలు, గౌరవరం, రుద్రకోట ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలతో రోజుకు ఎన్ని గంటలు పని చేస్తున్నారు, కూలీ గిట్టుబాటు అవుతుందా, కూలీ మొత్తాన్ని కచ్చితంగా చెల్లిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరపురంలో కూలీలు తమకు సక్రమంగా కూలీ డబ్బు చెల్లించడం లేదని, కొలతలు సక్రమంగా వేయడం లేదని ఫిర్యాదు చేయగా స్పందించిన కలెక్టర్ స్వయంగా ఆయా ప్రాంతాల్లో ఉపాధి కూలీలు చేసిన పనుల కొలతలు తీయించారు. ఈ సందర్భంగా కొలతల్లో తేడాలుండడం, కూలీ నగదు తక్కువగా వస్తున్నట్లు గుర్తించిన ఆయన సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికులు కలెక్టర్‌ను కలసి తాగునీటి ఎద్దడిని నివారించాలని, మద్యం బెల్టుషాపులు తొలగించాలని కోరగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ వర్షిణి, డ్వామా పిడి గౌతమి, ఆర్‌డిఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, తహశీల్దార్‌లు జయప్రకాష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లో వైఫల్యం చెందింది!

● **ఆత్మకూరు పాదయాత్రలో గూటూరు విమర్శ**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా భ్రష్టుపట్టి పోయిందని తెలుగుదేశంపార్టీ ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గూటూరు కన్నబాబు విమర్శించారు. ప్రజలు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలతో సతమతం అవుతుంటే కాంగ్రెస్ పాలకులు పదవులు కాపాడుకోవడానికి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి అంటూ జరిగింది తెలుగుదేశం పార్టీ తొమ్మిదేళ్ల పాలనలో నేనని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్న కాలంలో రాష్ట్రాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేశారని, ప్రపంచదేశాలు మెచ్చుకొనేలా చేశారన్నారు. ఇటీవల చార్‌ధామ్ యాత్రికులు వేలాది మంది మరణించి, అనేక మంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం వారి రక్షణకు చర్యలు చేపట్టలేదన్నారు. చంద్రబాబునాయుడు స్వయంగా వరద ప్రాంతాలకు వెళ్లి ఆంధ్రరాష్ట్ర ప్రజలను సురక్షితంగా ప్రత్యేక విమానాల్లో తరలించుకొని వచ్చిన తర్వాత కాంగ్రెస్ స్పందించిందన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి, అవినీతి వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పనున్నారన్నారు. వస్తున్నా మీకోసం పేరుతో నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పాదయాత్ర చేస్తున్న కన్నబాబు ప్రజలను కలుసుకొంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వెంకటాచలంలో నిశిరాత్రి ప్రచారం!

● **దడచుకొంటున్న ఓటర్లు**

పంచాయితీ ఎన్నికలు సమీపిస్తుండడంతో వివిధ రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాల్లో తలమునకలై వుంటున్నాయి. ఎవరికి వారు ఎత్తులు, పైఎత్తులు వేసుకొంటూ పంచాయితీలను ఎలాగైనా కైవసం చేసుకొనేందుకు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే వెంకటాచలం మండలంలో ఎన్నికల ప్రచారాలు చిత్రవిచిత్రంగా వుంటున్నాయి. మండలంలోని పలు పంచాయితీల్లో నేతలు రాత్రి సమయాల్లో ప్రచారం చేస్తుండడంతో ప్రజలు ఇవేమి రాజకీయాలు అనుకొంటున్నారు. అర్ధరాత్రి వేళ వచ్చి తలుపు తడుతుండడంతో అసలే దొంగతనాల కారణంగా తలుపులు బిగించి పడుకొంటున్న ప్రజలు వచ్చింది ఎవరో తెలియక భయపడిపోతున్నారు. ఇదేం పద్ధతని నేతలను ప్రశ్నిస్తే పగటి పూట కొందరిని, ముఖ్యంగా అవతల పార్టీ వారిని కలుసుకోలేం మా బాధలు మావి అంటున్నారు. ప్రజలు విసుక్కొన్నా పదవి దక్కితే అంతే చాలు అని అనుకొంటున్నారు వివిధ పార్టీల నేతలు. సర్వేపల్లి, కాకుటూరు, కసుమూరు, చెముడుగుంట, గొలగమూడి, అనికేపల్లి తదితర గ్రామాల్లో ఇలాంటి ప్రచారాలే చేస్తున్నారు.

● వెంకటగిరిని

ఎంతో అభివృద్ధి పరిచాం!

కార్యకర్తల సమావేశంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని పిసిసి కార్యదర్శి నేదురుమల్లి రామ్‌కుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో జరిగినంత అభివృద్ధి ఎప్పుడూ జరగలేదన్నారు. దీనిని దృష్టిలో వుంచుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లోను, శాసనసభకు 2014లో జరిగే ఎన్నికల్లోను తిరిగి కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకరావాల్సిన బాధ్యత కార్యకర్తలపై వుందన్నారు. వెంకటగిరిలోని తమ నివాసంలో ఇటీవల ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. వెంకటగిరిలో తమ తల్లిదండ్రులు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, రాజ్యలక్ష్మమ్మలు చేసినంత అభివృద్ధి పనులు ఎవ్వరూ చేయలేదన్నారు. వారి వారసుడిగా మీ ముందుకొస్తున్నానని చెప్పిన ఆయన కాంగ్రెస్‌పార్టీని ఎన్నికల్లో గెలిపించి తమ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

ఉదయగిరిలో తాగునీటికి కటకట!

అధికారుల నిర్లక్ష్యమే కారణం

ప్రభుత్వం ఫ్లోరిన్ భూతం నుంచి ప్రజలను రక్షించేందుకు పరిశుభ్రమైన నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పథకాలు ఉదయగిరి నియోజకవర్గంలో నిరుపయోగంగా మారడంతో ప్రజలు ఫ్లోరిన్ నీటినే తాగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఏడేళ్ల క్రిందట ఉదయగిరి మండలంలోని గండిపాళెం జలాశయం వద్ద 7 కోట్లు ఖర్చు చేసి నీటిని నిల్వ చేసే ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. దీనితో వరికుంటపాడు, ఉదయగిరి, వింజమూరు, కొండాపురం, దుత్తలూరు మండలాల్లోని గ్రామాలకు రక్షిత మంచినీటిని అందించడం ప్రధాన ఉద్దేశం. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రక్షిత నీరు మాట సంగతి దేముడెరుగు అసలు తాగేందుకు నీరే అందని పరిస్థితి ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలాశయం వద్ద ఏర్పాటు చేసిన ప్రాజెక్టు నుంచి అక్కడ వుండే ట్యాంకులకు నింపి వాటి నుంచి ఫ్లోరిన్ పీడిత గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్యాంకులకు సరఫరా చేసి వాటి ద్వారా కొళాయిలకు నీరు అందించాల్సి వుంది. ఇందుకోసం ప్రతి ఏడాది నిర్వహణకుగాను కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. నీటిని క్లోరినేషన్ చేసి ప్రజలకు తాగునీరు అందించేందుకు నెలనెలా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా గుక్కెడు తాగునీరు అందని పరిస్థితి నెలకొనడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి మండల పరిధిలోని దుంపావారిపల్లి, గండిపాళెం, తిరుమలాపురం, గుడినరవ, వెంగళరావునగర్, వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి, జడదేవి, విరువూరు, యర్రంరెడ్డిపల్లి తదితర గ్రామాలకు వారాల తరబడి తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికైనా అధికారులు రక్షితనీటిని అందించాలని కోరుకొంటున్నారు.

● కావలిలో

బీదమస్తాన్‌రావు జన్మదినోత్సవ వేడుకలు!



జనానికి అండగా వుంటానన్న ఎమ్మెల్యే

జీవించినంతకాలం తోటివారికి సహాయపడుతూ చేతనైన మేర సేవ చేయడంలోనే జీవితానికి సార్థకత వుంటుందని కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు వ్యాఖ్యానించారు. బీద జన్మదినాన్ని పురస్కరించుకొని జూలై 2న ఘనంగా వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావు మాట్లాడుతూ బ్రతికినన్నినాళ్లు మనిషిగా జీవించాలని, కష్టాల్లో వున్న వారిని ఆదుకోవాలని అప్పుడే మానవత్వానికి, మనిషికి అర్థం వుంటుందన్నారు. చిన్ననాటి నుంచే కష్టపడి చదివి ఉన్నత లక్ష్యంతో పైకి వచ్చానన్నారు. తనకు వస్తున్న ఆదాయంలో కొంత మొత్తాన్ని సమాజానికి ఉపయోగపెట్టాలన్న ఉద్దేశంతోనే బిఎంఆర్ చారిటబుల్ ట్రస్టు స్థాపించి ఉచిత వైద్యశిబిరాలు, మంచినీటి సరఫరా, నిరుద్యోగ యువతకు ఉపాధిశిక్షణతోపాటు సంక్షేమ వసతి గృహ విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తనపై కావలి నియోజకవర్గ ప్రజలు చూపుతున్న అభిమానాన్ని ఎన్నటికీ మరువనన్నారు. అనంతరం స్థానిక కళుగోళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలుచేశారు. ఈ కార్యక్రమంలో పూనూరు రవికుమార్‌రెడ్డి, మలిశెట్టి వెంకటేశ్వర్లు, దేవరాల సుబ్రహ్మణ్యం, ఆత్మకూరి బ్రహ్మయ్య, మాల్యాద్రి, ఖలీల్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నైలోని తెలుగువారి సమస్యలు తీర్చాలని తమిళనాడు ముఖ్యమంత్రి డాక్టర్ జయలలితకు వినతిపత్రం ఇస్తున్న తమిళనాడు తెలుగు యువశక్తి సంఘం అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి బృందం.

● కోడూరులో పుంజుకున్న

పంచాయితీ ఎన్నికల వేడి!

సర్పంచ్ అభ్యర్థి ఎంపికపై మల్లగుల్లాలు

తోటపల్లిగూడూరు మండలంలో మేజర్ పంచాయతీ అయిన కోడూరు అన్ని రాజకీయ పార్టీలకు కీలకం. ఇక్కడ దాదాపు 5వేలకు పైగా ఓట్లు వున్నాయి. శాసనసభ ఎన్నికల్లో ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు వున్న పంచాయితీ కావడంతో అందరి నేతల దృష్టి ఈ పంచాయితీపై వుంటుంది. ఇక్కడ నుంచి సర్పంచ్ ఎవరిని నిలపాలనే దానిపై సమాలోచనలు చేస్తూ అభ్యర్థులను జల్లెడపడుతున్నాయి ప్రధాన పార్టీలు. ముందు ఈ స్థానం జనరల్ అవుతుందని భావించిన చాలామంది దీనిపై కన్నేసి వున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఈ పంచాయితీ రిజర్వేషన్‌లో బిసి మహిళ అయ్యింది. దీంతో సర్పంచ్ పదవిపై ఆశపెట్టుకొని వున్న పలువురు ఖంగుతిన్నారు. ఆలస్యంగా తేరుకొని సరైన మహిళా అభ్యర్థి కోసం వెతుకులాట ప్రారంభించారు. కాంగ్రెస్, తెలుగుదేశం, వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ నెలకొని వుండడంతో ఎవరికి వారు తమ పార్టీ ఉనికిని కాపాడుకొనేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈ పంచాయతీలో పల్లెకాపులు, యాదవ, గాండ్ల కులస్తులతోపాటు మత్స్యకారులు వున్నారు. వీరి ఓట్లే కీలకం కానున్నాయి. కాంగ్రెస్‌పార్టీ తరపున ఈ పంచాయితీలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోడూరు దిలీప్‌రెడ్డి, జాఫర్‌సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ దువ్వూరు సురేంద్రనాథ్‌రెడ్డి, రాజకీయాల్లో ఆరితేరిన కావలిరెడ్డి రవీంద్రరెడ్డి వీరు తెలుగుదేశంపార్టీతో సర్దుబాటుకు యత్నిస్తున్నారు. వరిగొండకు చెందిన తెలుగుదేశంపార్టీ నేత చినబాబిరెడ్డి ఉమ్మడి ప్యానల్ క్రింద పోటీ చేయించేందుకు కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇందులో భాగంగా చెన్నపల్లిపాళెంకు చెందిన వీరబోయిన మంజులమ్మను ఇరుపార్టీలు పోటీకి ఒప్పించినట్లు సమాచారం. మాజీ సర్పంచ్ పెంచలయ్య భార్యగా ఆమెకు మంచిపేరు వుంది. వైఎస్ఆర్ సిపి నుంచి పాత పట్టపుపాళెం, నడింపట్టపుపాళెంలో అభ్యర్థి కోసం పోటీ ఏర్పడింది. మొదటగా ఆ పార్టీకి మద్దతు పలికి మత్స్యకారపాళెం నుంచి కాకాణి వెంట నడిచిన పరదేశి రఘు వర్గానికి ప్రాధాన్యమివ్వాలా లేక అధికంగా ఓట్లు వున్న పాత పట్టపుపాళెంలో అందరికి ఆమోదయోగ్యమైన తొలిశంగారి నావూరయ్య వర్గానికి ఇవ్వాలా అనే సందిగ్ధం ఏర్పడింది. మొత్తం మీద ఇక్కడ సర్పంచ్ ఎన్నికలు రసకందాయంలో పడ్డాయి.

కలువాయి సర్పంచ్ ఎవరో?

వైకాపా అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠత

కలువాయి పంచాయితీలో ఎన్నికల వేడి రాజుకుంది. ఈ ఎన్నికలలో ఎలాగైనా గెలుపొందాలని, తమ వర్గాన్ని కాపాడుకొని పంచాయితీపై పట్టు సాధించేందుకు నేతలు సిద్ధమౌతున్నారు. ఎవరికివారు ఎత్తులు పైఎత్తులు వేసుకొంటుండడంతో ఎన్నికల కోలాహలం నెలకొనింది. స్థానికులు అందరూ ఊహించినట్లే కలువాయి మేజర్ పంచాయితీ రిజర్వేషన్ల పరంగా ఓసి మహిళ అయ్యింది. అధికార కాంగ్రెస్‌పార్టీతోపాటు తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలు వున్నప్పటికి సర్పంచ్ పదవికి పోటీ ప్రధానంగా వైసిపిలోని రెండు వర్గాల మధ్య వుండడం ప్రాధాన్యత సంతరించుకొంది. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు సర్పంచ్ పదవికి అభ్యర్థిని పోటీకి నెలబెట్టే పరిస్థితులు కన్పించడం లేదు. ఈ రెండు పార్టీలు వైసిపిలోని ఒక వర్గానికి నాయకత్వం వహిస్తున్న మేకపాటి వెంకట నరసారెడ్డికి మద్దత్తు పలికేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ మేరకు పిసిసి ఉపాధ్యక్షుడు మాదాసు గంగాధరం, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తమ పార్టీల కలువాయి నేతలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మరో వర్గానికి చెందిన బులగాకుల అనిల్‌కుమార్‌రెడ్డి వర్గానికి నియోజవకర్గ సమన్వయకర్త కొమ్మి లక్ష్మయ్యనాయుడు మద్దతు పలుకుతుండడంతో రాజకీయం రంజుగా మారింది. మేకపాటి వెంకట నరసారెడ్డి తమ్ముడి భార్య వాణిని, మరో వర్గానికి చెందిన అనిల్ పెంచలకోన ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు చల్లా రఘురామిరెడ్డి భార్య ఇందిరను బరిలో దింపేందుకు సిద్ధమవుతున్నారు. ఇరు వర్గాలు 15 వార్డుల్లో గెలుపొందే వారి కోసం కసరత్తు చేస్తున్నారు. సాధారణంగా ఎక్కడైనా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోటీ నెలకొంటుంది. దీనికి భిన్నంగా కలువాయి పంచాయితీలో వైకాపాలోని రెండు వర్గాలు కత్తులు దూసుకోవడంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే జడ్పీ, శాసనసభ ఎన్నికల్లో మండలంలో ఆ పార్టీకి తీరని నష్టం జరుగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

దెయ్యం కథల మాస్టారు!

● స్కూల్ ఎగగొట్టను భలే ఎత్తుగడ!

పిల్లలకు లేనిపోని భయాలు చెప్పూ, దయ్యం వుందంటూ హడలుగొడుతూ బడి ఎగ్గొటి తిరుగుతున్న ఉపాధ్యాయుడు తమకొద్దంటూ స్థానికులు నిరసనకు దిగి పాఠశాలకు తాళాలు వేసిన ఘటన మనుబోలు మండలం పల్లిపాళెంలో జరిగింది. ఇక్కడ ప్రాథమిక పాఠశాలలో రబ్బానీ బాషా అనే టీచర్ పని చేస్తున్నాడు. ఇటీవలే మెయిన్ స్కూలుకు బదలీపై వచ్చిన ఆయన సక్రమంగా బడికిరాడట. చుట్టపుచూపుగా, తీరిగ్గా వున్నప్పుడు వచ్చి వెళ్తుంటాడట. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తుండడం, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుండడంతో కొత్త ఎత్తువేశాడట. పాఠశాలలో దెయ్యం తిరుగుతున్నాదంటూ పిల్లలకు చెప్పి వారిని భయపెడుతున్నాడట. ఇటీవల రెండో తరగతి చదివే కోటయ్య అనే విద్యార్థి అనారోగ్యంతో బాధ పడుతుండగా అతనికి దెయ్యం పట్టిందని చెప్పి భయభ్రాంతులకు గురి చేశాడట. అయ్యోరి దెబ్బకు నిజంగానే ఆ పిల్లోడు భయపడిపోయి బడికి రావడం మానేశాడని ఆ పిల్లవాడి తల్లిదండ్రులు చెప్తున్నారు. పాఠశాలకు ఎగనామం పెట్టేందుకు పిల్లలను భయపెడుతున్న అయ్యోరి భాగోతం గమనించిన గ్రామస్తులు ఇటీవల బడికి తాళం వేసి ఈ టీచర్‌ను మార్చాలని పట్టుబట్టారు. అధికారులు జోక్యం చేసుకొని ముందు ఈ టీచర్‌కు పట్టిన విధులకు గైర్హాజరయ్యే దయ్యాన్ని వదలిస్తే గాని బడి బాగుపడదు.

అభివృద్ధిలో తోటపల్లిగూడూరు వెనుకబడింది!

సమీక్షా సమావేశంలో చింతామోహన్ వ్యాఖ్య

ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో తోటపల్లిగూడూరు మండలం వెనుకబడి వుండడంపై తిరుపతి పార్లమెంటు సభ్యుడు చింతామోహన్ తీవ్ర ఆవేదన చెందారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతున్నా అధికారులు వాటిని సరిగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారన్న అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవల తోటపల్లి గూడూరు మండలానికి వచ్చిన ఆయన మండల పరిధిలోని వరిగొండ, రావూరివారి కండ్రిగ, తోటపల్లి గూడూరు, మల్లిఖార్జునపురం, ఈదూరు, వెంకన్నపాళెం, కొత్తపాళెం గ్రామాలకు సంబంధించి అధికారులతో సమీక్ష జరిపారు. ఉపాధిహామీ పథకం ఆశించిన స్థాయిలో జరగక పోవడంపై సిబ్బందిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గ్రామస్తుల నుంచి దీనిపై ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్పీ టెక్నికల్ అసిస్టెంటు చంద్రశేఖర్‌కు చురకలు అంటించాడు. మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారంటూ ఇందిరక్రాంతి పథం ఎపిఎం కృష్ణవేణిపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఒక దశలో ఆయన అడిగిన ప్రశ్నలకు సరిగా సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహించి చింతా పని చేయలేకపోతే వెళ్లిపోవాలని మండిపడ్డారు.



స్థానిక ఎస్ఐ సాంబశివరావు సరిగా పని చేస్తున్నాడని గ్రామస్తులు చెప్పడంతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకొన్న ఎస్ఐని ఇప్పుడే చూస్తున్నానంటూ అభినందించాడు. చివరగా వెంకన్నపాళెం వాసులతో మాట్లాడుతూ తన పాత మిత్రులు, బంధుత్వాలను నెమరువేసుకొన్నాడు.

కాకానికి తలనొప్పి!

సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజా దీవెన యాత్రలో తలమునకలై వున్న నియోజకవర్గ సమన్వయకర్త కాకాని గోవర్ధన్‌రెడ్డికి వివిధ మండలాల్లోని వర్గ పోరు తలనొప్పిగా పరిణమిస్తుంది. విస్తృతంగా పర్యటిస్తున్న ఆయనకు వివిధ వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తున్నా గ్రూపుల పోరు ఇబ్బంది పెడుతోంది. ప్రధానంగా తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల్లో వైఎస్‌ఆర్‌సిపి నేతల మధ్య తీవ్ర విబేధాలు నెలకొని వున్నాయి. తోటపల్లి గూడూరు మండలం పోట్లపూడి గ్రామానికి చెందిన విజయడైరీ మాజీ ఛైర్మన్, ఆ పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యుడు చిల్లకూరు సుధీర్‌రెడ్డికి, ఈదూరుకు చెందిన పార్టీ మండల కన్వీనర్ టంగుటూరు పద్మనాభరెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఎంపిపి టంగుటూరు శ్రీనివాసులరెడ్డి మధ్య పచ్చగడి వేస్తే భగ్గు మనేంతగా స్పర్ధలు చోటు చేసుకొన్నాయి. వైఎస్‌ఆర్ విగ్రహాల కొనుగోళ్లలో ఏర్పడిన స్వల్ప వివాదం ఆ తర్వాత బాగా రాజుకొని ఒకరంటే ఒకరికి గిట్టనంతగా పెరిగిపోయాయి. అత్యంత సన్నిహితులుగా కాంగ్రెస్‌లో మెలిగి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఢీకొన్న వీరు విరోధులుగా మారారు. ఇటీవల ఈదూరులో నిర్వహించిన ప్రజాదీవెనకు చిల్లకూరు వర్గం మొహం చాటేసింది. ఈ గొడవలకు ఆజ్యం పోసినట్లు పేదూరులో తెలుగుదేశంపార్టీలో చక్రం తిప్పి వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరి సహకార ఎన్నికల్లో పట్టు కోల్పోయిన తిక్కవరపు సనత్‌కుమార్‌రెడ్డి టంగుటూరు సోదరులకు మద్దత్తు ఇస్తునే సొంతంగా గ్రూపును ఏర్పాటు చేసుకొంటున్నాడు. మత్తుకూరు మండలంలో వైకాపాకు తొలుత జెండా కట్టి అన్ని తానై వ్యవహరించిన వాకాటి విజయకుమార్‌రెడ్డికి ప్రత్యామ్నాయంగా, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి రంగ ప్రవేశం చేయడంతో వాకాటి ఒంటరైపోయాడు. మరో వైపు కాకాణి ఒక సామాజిక వర్గానికి చెందిన వారికే అధిక ప్రాధాన్యమిస్తూ తమను నిర్లక్ష్యం చేస్తున్నాడన్న అభిప్రాయం దళిత, బిసి వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇక పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం మండలాల్లో గ్రూపుల పోరు పెద్దగా లేదు. వున్న చోట వాటిని గోవర్ధన్‌రెడ్డి ఎలా చక్కదిద్దుతారన్నది చూడాల్సి వుంది. లేకపోతే వీటి ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలపై పడే ప్రమాదముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తోటపల్లి గూడూరులో పంచాయితీ ఎన్నికలతో...

దగదర్తిలో తిష్టవేసిన సమస్యలు!

దగదర్తి మండలంలోని సమస్యలు ఏళ్ల గడుస్తున్నా ఇంతవరకు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేతల హామీలు, అధికారుల మాటలు అన్ని వొట్టిమాటలుగా మిగలడంతో ఈ సమస్యలకు ఎప్పుడు మోక్షం లభిస్తుందో అని మండల ప్రజలు ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. మండల పరిధిలోని కాట్రాయపాడు, ధర్మవరం, చెన్నూరు, ఎర్రసముద్రం, మబ్బుదిన్నె పాళెం, వెలుపోడు తదితర ప్రాంతాల్లో రోడ్డు మార్గం లేక రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందుల పడాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. దీనికి తోడు ఆయా ప్రాంతాల్లో చప్టాల దగ్గర వంతెన నిర్మాణం జరగక పోవడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. వర్షాలు పడినపుడు, వరదలు వచ్చిన సందర్భాలలో ధర్మవరం, చెన్నూరు లాంటి చోట్ల చప్టాలు నీటితో మునిగిపోయి పలువురు మృత్యువాత పడిన ఘటనలు వున్నాయి. ప్రతి ఏటా వర్షాలు కురిసినపుడు దగదర్తి పంచాయితీ జలమయం అవుతున్నా, సమస్య తీవ్రత తెలిసినా పట్టించుకొనే వారే లేకుండాపోయారు. గతంలో రచ్చబండ కార్యక్రమం ఈ ప్రాంతంలో జరిగినపుడు ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి వివిధ ప్రాంతాలలో వంతెనల నిర్మాణానికి, రోడ్లు ఏర్పాటుకు హామీ ఇచ్చినా అవి ఇంతవరకు ఆచరణకు నోచుకోకపోవడంతో మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బోగోలులో రేషన్ డీలర్ల చీటింగ్!

రేషన్ ఇవ్వరు - ఇచ్చినా తూకంలో మోసం.

బోగోలు మండలంలో చౌక దుకాణాల డీలర్లది ఇష్టారాజ్యం అయ్యింది. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయకపోవడం, తూకాల్లో మోసాలు వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నా తనిఖీ చేసే వారే లేకపోవడంతో కార్డుదారులు వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఒకరిద్దరు డీలర్లు తప్ప అధికభాగం డీలర్లపై ఇలాంటి ఫిర్యాదులే వస్తున్నాయి. కిరోసిన్, బియ్యం పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తుంటారట. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యానికి దిగడం దిక్కున్న చోట చెప్పుకోమని పెడసరంగా జవాబిస్తుంటారని పలువురు వాపోతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల నేతల హవా. కార్యాలయంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా వీరు అండదండలు అందిస్తూ తమ శక్తిమేర సహకారం అందిస్తుండడంతో వీరిపై వెళ్లే ఫిర్యాదులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. తహశీల్దార్ కార్యాలయంలో ఏ సమావేశం జరిగినా, ఏ కార్యక్రమం జరిగినా షామియానాలు, బాడుగకు వస్తువులు తేవడం, తినడానికి కావలసిన వంటివన్ని డీలర్లు చూసుకొంటుంటున్నారు. దీంతో వీరు ఆడింది ఆటైంది. ఇవే కాకుండా సిబ్బందికి బహుమానాలు అందిస్తుండడంతో డీలర్లపై వచ్చే ఫిర్యాదులు బుట్టదాఖలవుతుండడంతో రేషన్ సరుకులు తీసుకొన్నవారికి అన్యాయం జరుగుతోంది.

మీ సేవా కేంద్రాల్లో ఫీజుల దోపిడీ!

కలువాయి, చేజర్లలలో ఇదే తంతూ!

ప్రజలకు సత్వరమే వివిధ సేవలు అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మీసేవా కేంద్రాలు అవినీతి కేంద్రాలుగా మారుతున్నాయి. కలువాయి, చేజర్ల మండలాల్లోని మీసేవా కేంద్రాలను గమనిస్తే అవినీతి తేటతెల్లం అవుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కన్నా అధికంగా ఈ కేంద్రాల్లో వసూళ్లు చేస్తుండడంతో ఇక్కడకు వివిధ ధృవీకరణ పత్రాలు ఇతరత్రా సేవలకై వచ్చేవారు నిలువు దోపిడీకి గురౌతున్నారు. 10–1బి, అడంగల్, జనన, మరణ పత్రాలు, ఆదాయ, కుల ధృవీకరణ సర్టిఫికేట్‌లు తదితర వాటికి ఎంతెంత వసూలు చేయాలో తెలుపుతూ ప్రభుత్వం బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ అదెక్కడా అమలు కావడంలేదు. మీసేవా కేంద్రాల నిర్వాహకులు ప్రతి సర్టిఫికేట్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా అధికంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఎవరైనా ఇదేమిటని ప్రశ్నిస్తే అది అంతే ప్రభుత్వం చెప్తున్న ఫీజులు వసూలు చేస్తే మాకు గిట్టుబాటు కాదని తలబిరుసుగా సమాధానం చెప్తున్నారట. అలాగే సర్టిఫికేట్‌కు దరఖాస్తు చేసుకొన్న తర్వాత నిర్ణీత సమయంలోగా వాటిని అందజేయాల్సి వుండగా ఆలస్యం చేస్తూ, మీసేవా కేంద్రాల చుట్టు తిప్పుకొంటున్నారట. నెట్ స్లోగా వుందనో, మరో కారణమో చెబుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మీసేవా కేంద్రాల పనితీరును తనిఖీ చేస్తే కాస్త అయినా ప్రజలకు మేలు జరుగుతుంది.



లోక ప్రసిద్ధం పూరి జగన్నాధ రథయాత్ర!



శక్తి పీఠాలలో 17వదైన పూరి జగన్నాధ ఆలయం ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఒరిస్సా రాష్ట్రంలో వుండే ఈ జగన్నాధునికి ప్రతిఏటా జరిగే రథోత్సవం లోకప్రసిద్ధం. ఇక్కడ కొలువై వుండే విమలాదేవి అమ్మవారు, జగన్నాధ స్వామిని కులమత జాతి బేధాలు లేకుండా ప్రపంచవ్యాప్తంగా అందరు వచ్చి దర్శించుకొంటుంటారు. హిందువులకు ఇది అత్యంత పవిత్రమైన దర్శనీయ పుణ్య క్షేత్రం. విష్ణువును, కృష్ణుడిని ఆరాధించే వారికి ఇది అత్యంత ముఖ్యమైన క్షేత్రం. ఆషాడ మాసం విదియనాడు జరిగే రథోత్సవాన్ని కనురాలా తిలకించేందుకు లక్ష లాది మంది భక్తులు పూరీ క్షేత్రానికి తరలి వస్తుంటారు. ఇందులో ప్రధానంగా మూడు విగ్రహాలను అందంగా అలంకరించిన రథాలపై ఊరేగిస్తారు. దీనినే రథయాత్ర అంటారు. ఈ జగన్నాధ రథయాత్ర విశేష ప్రాధాన్యత సంతరించుకొంది.

శ్రీ జగన్నాధస్వామి విగ్రహాలతో పాటు ఆయన సోదరులైన బలరాముడు, సోదరి సుభద్ర విగ్రహాలు ఈ ఆలయంలో ప్రతిష్టింపబడి వుండడం విశేషం. ఈ ఆలయాన్ని 8వ శతాబ్దం చివరన ఈ ప్రాంతాన్ని ఏలిన రాజు రెండవ మహాశివ గుప్త యయాతి కట్టించాడని ప్రతీతి. అలాగే దీనిని 12వ శతాబ్దంలో చోడ గంగదేవ నిర్మించాడని చరిత్రకారులు భిన్నభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటారు. ఈ రథయాత్రను శ్రీకృష్ణ భగవానుడు గోకులం నుండి మధురకు చేసే యాత్రగా చెప్తారు. ఆలయంలో గల జగన్నాధ, బలబధ్ర, సుభద్రల విగ్రహాలను తెచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ప్రతిష్టించి రథయాత్ర జరుపుతారు. ఆలయం ముందు నుంచి మొదలైన ఈ రథయాత్ర కిలోమీటరు దూరంలో వున్న గుండీచ మందిరం వరకు సాగుతుంది. ఈ రథయాత్ర ప్రారంభం అయ్యే ముందు రథాన్ని, ఆ రహదారులను రాజవంశీయులు బంగారు చీపురుతో శుభ్రం చేయడం సాంప్రదాయంగా వస్తోంది. రాజైనా స్వామి వారికి సేవకుడేనని తెలిపేందుకు అనాదిగా ఆ ఆచారాన్ని పాటిస్తూ వస్తుండడం విశేషం. రథయాత్రలో జగన్నాధ స్వామికి, బలభద్రుడికి, సుభద్రాదేవికి ప్రత్యేక రథాలుంటాయి. జగన్నాధుని రథాన్ని నంది ఘోష్ అన్న పేరుతో పిలుస్తారు. ఎరుపు, పసుపు రంగులతో చేయబడిన దివ్యవస్త్రాలతో ఈ రథాన్ని అలంకరింస్తారు. ఈ రథం 45 అడుగుల ఎత్తు కల్గి వుంటుంది. దీనికి అతిపెద్ద 16 చక్రాలు వుంటాయి. బలభద్రుడి రథాన్ని తాళ్‌ధ్వజ్ అని పిలుస్తారు. ఎరుపు, ఆకుపచ్చ రంగులతో అలంకరించే ఈ రథం ఎత్తు 44 అడుగులు. దీనికి 14 చక్రాలు వుంటాయి. అలాగే సుభద్రాదేవి రథాన్ని దర్పదళన అనే పేరుతో పిలుస్తారు. ఒక ప్రత్యేకతమైన శైలిలో ఈ మూడు రథాలు ఒక్కో అడుగు లెక్కన ముందుకు కదులుతుంటాయి. రథం కదిలే సమయంలో శంఖం, గంటలను మ్రోగిస్తారు. వీటిని దర్శించుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరిస్తారు. పూరీలో ఈ రథయాత్ర జరిగే సమయంలోనే ప్రపంచ వ్యాప్తంగా పలు పట్టణాలలో రథోత్సవాలు నిర్వహిస్తారు.



షుగర్ వ్యాధిగ్రస్తులకు
సంజీవని జెరిటిన్-డి

భవిత ఏమిటో?

బంగారు తల్లి పథకం అమలుకు కసరత్తు!

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బంగారు తల్లి పథకం అమలుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. అయితే ఈ పథకాన్ని అమలు చేయాల్సిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఈ పథకంపై సవాలక్ష సందేహాలుండడం ఆలోచింపజేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం మే నెల నుంచి ప్రవేశపెట్టిన "బంగారు తల్లి" పథకం అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. భవిష్యత్‌లో ఈ పథకం నిర్వీర్యం కాకుండా వుండేందుకు చట్టబద్ధత కూడా కల్పించింది ప్రభుత్వం. మే ఒకటి నుండి జన్మించిన ఆడ శిశువుకు ఈ పథకం క్రింద లక్షరూపాయలు చెల్లిస్తారు. శిశువు మైనార్టీ తీరిన తర్వాత లక్ష రూపాయలు అందిస్తారు. ఈ పథకం క్రింద తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబం అర్హులుగా గుర్తిస్తారు. పలు దఫాలు మంత్రివర్గం చర్చించిన తర్వాత విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించి ఆ తర్వాత అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. ఈ పథకం అమలు కోసం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించినట్లు ప్రకటించింది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బంగారుతల్లి" పథకం అమలు చేయనున్నారు.

ప్రస్తుతానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ బంగారు తల్లి పథకానికి లబ్దిదారులు ఎంపిక జరుగుతుంది. గతంలో ఇద్దరు ఆడ పిల్లలు పుట్టిన వారికి 60వేల రూపాయలు చెల్లించేవారు. బాలిక సంరక్షణ పథకంను రద్దుచేసి దీని స్థానంలో బంగారుతల్లి పథకంను ప్రవేశ పెట్టారు. పట్టణ ప్రాంతాలతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో వున్న అంగన్ వాడీ కార్యకర్తలు లబ్దిదారులు నుంచి దరఖాస్తులు స్వీకరించి ఐసిడిఎస్ అధికారులకు అందజేసేవారు. ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేసి ఉత్తర్వులు అందజేసేవారు. గతంలో ఎంపిక చేసిన లబ్దిదారులకు బ్యాంకుల్లో నగదు జమ చేసేందుకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. ఇప్పటికీ పలువురు బాలికల తల్లిదండ్రులు ఆశాఖ జిల్లా కార్యాలయం చుట్టూ తిరుగుతూనే వున్నారు. వీరిని "బంగారుతల్లి" పథకం క్రింద చేరుస్తారా లేదన్నది స్పష్టంగా తెలియడం లేదు.

ప్రచారం నిల్

బంగారు తల్లి పథకం అమలుకు సంబంధించి జిల్లాలో సరైన ప్రచారం జరగడం లేదు. మే నెల నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం గురించి విస్తృత ప్రచారం చేయాలని ప్రభుత్వం ఆదేశించినా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుంది. డిఆర్‌డిఏ అధికారులు మాత్రం సిబ్బందితో నిర్వహించే సమీక్షా సమావేశాల్లో బంగారు తల్లి పథకం లబ్దిదారులను గుర్తించి వివరాలను సేకరించాలని చెబుతున్నారు. మే ఒకటి నుంచి జన్మించిన ఆడ శిశువులు ఈ పథకం ద్వారా ఎంపిక జరగాలి. ఈ మూడు నెలలు వ్యవధిలో దాదాపు వెయ్యి మందికి పైగా దరఖాస్తు చేసినట్లు తెలిసింది. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమలు చేసే ఈ పథకానికి ఈ సంవత్సరం ఎంతమంది లబ్దిదారులను ఎంపిక చేయాలని దానిపై స్పష్టమైన ఆదేశాలు జారీ కాకపోవడంతో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

గతంలో ఎంపిక చేసిన వారికి బ్యాంకుల్లో నగదు జమ చేస్తారో లేక అప్పట్లో జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేస్తారో అన్న దానికి సమాధానం లేకుండా పోయింది. ఇద్దరు ఆడశిశువులకు లక్ష రూపాయలు ప్రభుత్వం అందిస్తుందని సమాచారం తెలియడంతో బాగా డిమాండ్ పెరిగింది. ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు జరిగి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారే ఈ పథకం క్రింద అర్హులు. కొన్ని ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు లేక ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోవాల్సి వస్తుంది. ఇటువంటి వారిని ఏ విధంగా ఎంపిక చేస్తారో వేచి చూడాలి. లక్షరూపాయలు 20 సంవత్సరాల్లో జమ చేస్తుండడంతో వేలల్లో దరఖాస్తులు అందే అవకాశం వుంది. అయితే రాష్ట్రప్రభుత్వం జిల్లాలకు ఎంత మంది లబ్దిదారులను ఎంపిక చేయాలన్న దానిపై ఆదేశాలు లేవని ఆశాఖ అధికారులు అంటున్నారు.

మండల కార్యాలయాలు గ్రామ పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో బంగారుతల్లి పథకం గురించి మరింత ప్రచారం చేయాల్సిన అవసరం వుంది. ఈ పథకం అమలుకు నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలు ప్రతి అంగన్‌వాడి కేంద్రంలో అందుబాటులో వుంచితే ఆయా గ్రామాల ప్రజలకు వివరించవచ్చు.

గంటి ప్రసాదం హత్యపై

సవాలక్ష అనుమానాలు!

అమరవీరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాజీ మావోయిస్టు గంటి ప్రసాదం ఈ నెల 4వ తేది నెల్లూరు నగరంలో దారుణ హత్యకు గురైనాడు. టౌన్‌హాల్లో అమరవీరుల స్మారక సభలో పాల్గొనేందుకు వచ్చిన ప్రసాద్‌ను గుర్తు తెలియని దుండగులు కత్తితో నరికి ఆపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ప్రాథమిక చికిత్స నెల్లూరు ఆస్పత్రిలో అందించి ఆ తర్వాత నారాయణ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. గంటి ప్రసాదం హత్యపై అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. హైదరాబాద్ నుంచి రైలులో నగరానికి వచ్చిన ఆయన ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టౌన్‌హాల్లో నిర్వహించిన విరసం సదస్సులో పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి అమరవీరుల స్మారక సభలో పాల్గొనాల్సి వుంది. భోజన విరామం సమయంలో నెల్లూరు ఆస్పత్రికి అనారోగ్యంతో చికిత్సకు వచ్చిన కామేశ్వరమ్మను పరామర్శించేందుకు ప్రసాదంతోపాటు మరో ఇద్దరు వెళ్లారు.

రెండు రోజుల ముందే రెక్కి


గంటి ప్రసాదంపై కాల్పులు జరిపిన ముగ్గురు వ్యక్తులు రెండు రోజులు ముందుగానే నగరంలో, టౌన్‌హాల్ వద్ద రెక్కీ నిర్వహించారని సమాచారం. టౌన్‌హాల్లో ఒకే రోజు రెండు కార్యక్రమాలు నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం జూలై 4న ఈ రెండు కార్యక్రమాలు జరుగుతుంటాయి. రెండు సంవత్సరాల క్రితం గంటి ప్రసాదం ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే ఈ దఫా ఊహించని విధంగా గంటి ప్రసాదం నగరానికి వచ్చి దారుణ హత్యకు గురికావడం నిర్వాహకులతోపాటు వివిధ ప్రజా సంఘాల నేతలు ఆందోళనకు గురికావాల్సి వచ్చింది. ఉద్యమాల జిల్లాగా పేరొందిన నెల్లూరులో ఇటువంటి తరహాలో పాశవిక హత్యలు ఎన్నడూ జరగలేదు. పోలీసు ఎన్‌కౌంటర్లలో మన జిల్లాలో ఏడుగురు ఇతర జిల్లాల్లో మరణించిన వారు వున్నారు. ప్రజా ఉద్యమాల్లో పని చేసే నేతలకు వ్యక్తిగత శత్రువులుండరు. ప్రభుత్వం, పోలీసు విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పే వారు, గతంలోనూ హత్యకు గురైన సంఘటనలు వున్నాయి. ప్రసాదంపై కాల్పులు జరిపిన వ్యక్తులు పోలీసులుగానీ, లేదా వారు ఉపయోగించిన కిరాయి హంతకులుగానీ వుంటారని పౌరహక్కుల సంఘం, విరసం నేతలు ఆరోపిస్తున్నారు. ఎందుకంటే ప్రసాదంకు మన జిల్లాలో శత్రువులు ఎవరూ వుండరు బయట జిల్లా నుంచి తీసుకొచ్చిన వ్యక్తులే హత్య చేశారని చెబుతున్నారు. గ్రీన్ హంట్, కోబ్రా, రెడ్‌టైగర్స్ తదితర పేర్లతో ఏర్పాటైవున్న పోలీసు దళాలు గతంలో హక్కుల సంఘాల నేతలను దారుణంగా హత్య చేశాయి. వీరిలో డాక్టర్ రామనాధం, పురుషోత్తం, జాపా లక్ష్మారెడ్డి, బెల్లి లలిత, ఆజం అలీ తదితరులు ఇదే తరహాలో హత్య గావించబడ్డారని వారు గుర్తు చేస్తున్నారు. ప్రసాదంపై కాల్పులు జరిపిన సమాచారం అందిన వెంటనే పోలీసు శాఖ స్పందించి నగర శివారు ప్రాంతాల్లో అన్ని దారుల్లో తనిఖీలు నిర్వహించి వుంటే దుండగులు దొరికిపోయేవారని అంటున్నారు. కానీ పోలీసులు ఆ దిశగా తనిఖీలు చేపట్టక పోవడంపై ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

జిల్లా ఎస్పీ రామకృష్ణ నారాయణ వైద్యశాలకు వెళ్లి ప్రసాదం ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేసు దర్యాప్తులో వుంది త్వరలో పూర్తి సమాచారం అందిస్తామని ప్రకటించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను పట్టుకుని వాస్తవాలు వెల్లడించక పోతే, పోలీసుల పాత్రపై ఇప్పటి వరకున్న అనుమానాలకు బలం చేకూర్చినట్లవుతుంది. ఇందులో పోలీసు పాత్ర వుంటే మాత్రం ఈ కేసు సంవత్సరాలు గడిచినా ఎప్పటికీ పురోగతి వుండదు. ప్రజా గాయకుడు గద్దర్‌పై 16 సంవత్సరాల క్రితం జరిగిన హత్యాయత్నం కేసును ఇందుకు ఉదాహరణగా హక్కుల సంఘాల నేతలు చెబుతున్నారు. నెల్లూరు నగరం నడిబొడ్డున ఎప్పుడూ రద్దీగా వుండే జిల్లా కోర్టు సమీపంలో ఈ హత్య జరగడంతో జిల్లా ప్రజానీకం ఉలిక్కి పడింది. శ్రీకాకుళం జిల్లాలో పుట్టి మావోయిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించాడు గంటి ప్రసాదం. ఉద్యమం నుండి బయటకొచ్చిన తర్వాత ప్రజా సంఘాలు నిర్వహించే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగినప్పుడు మరణించిన వారి మృతదేహాలను స్వాధీనం చేసుకునేందుకు అమరుల బంధుమిత్రుల కమిటీని ఏర్పాటు చేశాడాయన. మన రాష్ట్రంతోపాటు దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ జరిగినా అక్కడికి వెళ్లిపోతుంటాడు. మరణించిన వారి మృతదేహాలను స్వాధీనం చేసుకొని వారి స్వస్థలాలకు చేర్చి అంత్యక్రియలు నిర్వహించడం చేస్తారు. ఎన్‌కౌంటర్లపై ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టడం, ఆందోళనలు నిర్వహించడం, సభలు సమావేశాల్లో పాల్గొనడంపై గంటి ప్రసాదంపై అనేక కేసులు వున్నాయి. ఈ కేసులు కోర్టులో రుజువు కాకపోవడంతో కొట్టేశారని ఆయన సతీమణి గుర్తు చేశారు. నెల్లూరుకు అతిథిగా వచ్చిన ఆయన్ని దుండగులు అతి దారుణంగా కాల్పులు జరిపి, కత్తితో మెడపై నరికి హత్య చేయడాన్ని అందరూ ఖండిస్తున్నారు. ప్రసాదంతో పాటు అతిథులుగా వచ్చిన విరసం నేతలు కళ్యాణ రావు, సిఎస్‌ఆర్.ప్రసాద్‌లు ఆస్పత్రి వద్దకు వెళ్లి వుంటే వారిపై కూడా దాడి జరిగి వుండేదని సన్నిహితులు అంటున్నారు.



గంటి ప్రసాదంకు లాల్ సలాం చేస్తున్న విరసం నాయకుడు కళ్యాణరావు, బ్రహ్మం, యుగంధర్ తదితరులు.

జాతీయస్థాయి ఉద్యమ నేతగా ఎదిగిన గంటి ప్రసాదం హత్యకు గురికావడంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభమైనాయి. ఈ కేసులో చోటుచేసుకున్న అనుమానాలు, సందేహాలకు పోలీసు బాస్‌లే సమాధానం చెప్పాల్సి వుంటుంది. పౌరహక్కుల సంఘం, విరసం నేతలు పోలీసులపై చేసిన ఆరోపణలు, విమర్శలకు ఇప్పటి వరకు వివరణ రాలేదు. ఈ కేసులో దాగి వున్న అనేక చిక్కుముడులు విప్పాల్సిన బాధ్యత పోలీసులదే.





మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

ఇంట్లో చేసే శుభకార్య యత్నాలు ఫలిస్తాయి. బుద్ధిబలం పెరుగుతుంది. అయితే ఈ వారం ఆర్థిక పుష్టికి చేసే ప్రయత్నాలు ఫలించవు. వృత్తి, వ్యాపారాలు పర్వాలేదనిపిస్తాయి. మీ ఆలోచనలు ఫలించవు. సమయస్ఫూర్తికి ప్రాధాన్యత ఇవ్వాలి. సమయం వృధా కాగలదు. ఇంటాబయట సంజాయిషీలు అధికమౌతాయి. రుణ బాధలున్నప్పటికీ సమస్యలు కావు.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

రుణ విముక్తికై మార్గాలు అన్వేషిస్తారు. స్థానచలనం వుండదు. కొంత వరకు మనోవ్యాకులత తగ్గుతుంది. నూతన వాహనాల కొనుగోలుకై ఆలోచనలు చేస్తారు. ఇతరులకు ఏ విషయంలోనూ హామీలివ్వకండి. సంజాయిషీలు ఇచ్చుకోవాలి. గతంలో ఏర్పడ్డ వివాదాలు తగ్గుతాయి. శరీరారోగ్యం సామాన్యం, స్నేహితులతో వైరం, తద్వారా ధన వ్యయమవుతుంది. తలపెట్టిన పనులు వాయిదా పడతాయి.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

అంతర్గత వ్యవహారాలుంటాయి. ప్రయాణాలలో జాగ్రత్తలవసరం. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోని వారికి కొన్ని ప్రతిబంధక సమస్యలు తొలగుతాయి. ఆర్థికంగా నిలదొక్కుకొంటారు. అవసరానికి రుణ సౌకర్యం లభిస్తుంది. మాతృవర్గీయులతో మాట పట్టింపులు వద్దు. అకారణ వైరాలు, బంధుపీడ, శారీరక వధలు కలుగుతాయి. దుస్వప్నాలు, నిద్రలేమి బాధిస్తాయి. ఉద్యోగులకు పని భారం అధికం.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

ఇష్టకార్యసిద్ధికై పుణ్యకార్యాచరణాలపై మక్కువ పెంచుకొంటారు. వ్యక్తిగత నిర్ణయాల వల్ల సముచిత గుర్తింపు లభిస్తుంది. నూతన నిర్ణయాలు తీసుకొంటారు. స్పెక్యులేషన్ స్వల్పంగా లాభిస్తుంది. వ్యాపార విస్తరణ లేదా నూతన వ్యాపారాలకై ఆలోచన చేస్తారు. తరచూ ప్రయాణాలు, ప్రయాణాలలో వివాదాలు ఏర్పడగలవు. ఇతరులపై అనవసర ద్వేషభావన. చేపట్టిన పనులకు ఆటంకాలేర్పడతాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

తలపెట్టిన పనులు పూర్తి కావటానికి ఇతరుల సహాయాన్ని అర్థించవద్దు. సంతాన విషయం, వారి సమస్యలు స్వల్పంగా పెరుగుతాయి. తొందరపడి ఇతరులతో పెదవి విప్పి మాట్లాడవద్దు. సమస్యలేర్పడతాయి. కళా, క్రీడాకారులకు, వైద్య, కార్మికులకు అనుకూలం. కొంత కాలంగా వున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. మీ నిత్యకృత్యాలలో చేర్పులు, మార్పులు సంభవిస్తాయి.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

అధిక వ్యయప్రయాసలతో విజయం సాధిస్తారు. ఇతరుల నుండి వచ్చే విమర్శలు, నిందలు తట్టుకొంటారు. స్పెక్యులేషన్ వద్దు. అవివాహితులకు వివాహ యోగం. రాజకీయులకు శృంగభంగం. కొన్ని సమస్యల నుండి బయటపడి ప్రశాంతత పొందుతారు. వృత్తి, వ్యాపారాలు వృద్ధిబాట పడతాయి. ఆర్థికంగా నిలదొక్కుకొంటారు. కుటుంబ వ్యక్తులకు కావలసిన వ్యవహారాలు కాస్త ఆలస్యంగా తీరుస్తారు.

వారఫలాలు

తేది 13-7-2013 నుండి 19-7-2013 వరకు మేషంలో కేతువు; మిథునంలో కుజ, బుధ, గురులు, రవి 17తేది నుంచి శుక్రునితో కర్కాటంలో; 19 తేది నుంచి శుక్రుడు సింహంలో; తులలో శని, రాహువులు; సింహ, కన్య, తుల, వృశ్చికాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

13తేది స్కంధ పంచమి.
14తేది కుమార షష్టి, కూర్మ షష్టి, భాను షష్టి.
15తేది వివస్వత సప్తమి.
16తేది కర్కాటక సంక్రమణం మ3గం.44ని॥లకు.
17తేది దక్షిణాయనం ప్రారంభం.
18తేది దిథి వ్రతారంభం, మహాలక్ష్మి వ్రత ప్రారంభం.
19తేది హరిశయన ఏకాదశి, తొలి ఏకాదశి, చాతుర్మాస్య వ్రతారంభం.

శుభ ముహూర్తాలు

ఆగష్టు 6తేది వరకు ఆషాడ మాసం శూన్య మాసం కనుక శుభ ముహూర్తాలు లేవు. సీమంత, అన్నప్రాసనాది సామాన్య కార్యాలకు ముహూర్తాలున్నాయి.

జూలై తిథులు
ఆషాడ శుద్ధ

13	శని	పంచమి	రా	08.54 గం.ల.వ
14	ఆది	షష్ఠి	రా	09.17 గం.ల.వ
15	సోమ	సప్తమి	రా	09.06 గం.ల.వ
16	మంగళ	అష్టమి	రా	08.17 గం.ల.వ
17	బుధ	నవమి	సా	06.48 గం.ల.వ
18	గురు	దశమి	సా	04.40 గం.ల.వ
19	శుక్ర	ఏకాదశి	ప	01.58 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

కొంతకాలంగా వున్న మానసిక సమస్యలకు మానసిక చింతన తగ్గుతుంది. సంతానరీత్యా ఖర్చులు పెరుగుతాయి. విజయం సాధిస్తారు. ఇతరులకు హామీలివ్వవద్దు. శరీరారోగ్య విషయమై శ్రద్ధ అవసరం. మిత్రత్వం, శత్రుత్వం గమనించి సంభాషించాలి. కొన్ని విపత్కర పరిస్థితులెదుర్కోవాల్సి రావచ్చు. నూతన పెట్టుబడులకు ఆదాయం వుండదు. అయితే వృత్తి, వ్యాపారుల ఆదాయం బాగుంటుంది.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

దూర ప్రయాణాలు వాయిదా వేయండి. సహచరులతో అభిప్రాయ భేదాలుండవచ్చు. సమయస్ఫూర్తి పాటించడం మంచిది. కొన్ని కీలక విషయాలలో మీ సంతానం మిమ్ములను వ్యతిరేకిస్తుంది. స్పెక్యులేషన్ కలసిరాదు. ఇతరులతో వాదనలు తగ్గించడం మంచిది. దుష్ట సాంగత్యం, తద్వారా చీకాకులు, అనుమానాలుంటాయి. వృత్తి, వ్యాపార, ఉద్యోగులకు అనుకూలతలు తక్కువగా వుంటాయి.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

మీ ఆలోచనలకు, అంచనాలకు స్థిర నిర్ణయాలు తీసుకోలేరు. చేదు అనుభవాలధికం. ఇతరులపై ఆరోపణలు తగ్గించండి, మనస్పర్ధలు ఏర్పడగలవు. వాదన పటిమ పెంచుకోవాలి. ఉద్యోగులు తగు జాగ్రత్తలు పాటించాలి. మీపై నిఘా ప్రయత్నాలుంటాయి. కోపతాపాలు, హావభావాలను అదుపులో వుంచుకోండి. శ్రమకు, కృషికి తగిన ఫలితాలుంటాయి. వ్యవసాయ పనులు వాయిదా వేయడం మంచిది.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

ఉద్యోగులకు, ఇతరులకు స్థాన చలనాలున్నాయి. మానసిక సంఘర్షణలకు దూరంగా వుండండి. శ్వాశకోశ రుగ్మతలు అధికమౌతాయి. పాలనా నిర్ణయాలలో లోపాలను సరిచేస్తారు. కొన్ని సమస్యలకు పరిష్కారం కనుగొంటారు. వాగ్దానాలు నిలుపుకొంటారు. స్త్రీలతో ప్రవర్తించేటప్పుడు అతి అనర్థం వల్ల కష్టనష్టాలు కలిగే సూచనలున్నాయి. కుటుంబ వ్యక్తుల సహాయం లభిస్తుంది.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

బంధుమిత్రులతో అభిప్రాయభేదాలుంటాయి. స్వయంవృత్తుల వారు, వృత్తి పనివారు ధైర్యంగా ముందుకెళ్తారు. కుటుంబ కలహాలు తగ్గుతాయి. అనవసర విషయాలలో మనస్సు లగ్నం చేయవద్దు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు, ముక్కు సూటి వ్యవహారాలలో ముందస్తు విజయం. అవసరార్థం ఇంట్లోకి నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా వుంటాయి.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

తలపెట్టిన పనులన్నీ సకాలంలో పూర్తి చేస్తారు. సమయస్ఫూర్తి అవసరం. ఇతరుల ప్రశంసలు అధికం. కొన్ని కీలక అంశాలలో ప్రేక్షకపాత్ర వహిస్తారు. ఉద్యోగాలలోని వారికి జాగ్రత్తలవసరం. వృత్తి, వ్యాపారాలలో మెళకువలు అవసరం. వ్యాపార మూలక పెట్టుబడులు, దైవకార్యాలలో ఆటంకాలు, కుటుంబంలో అన్యోన్య భావాలుంటాయి. ప్రత్యర్థులు మిత్రులుగా మారుతారు.

వివాహ విచ్ఛేదనకు సవాలక్ష కారణాలు!

టి.ఎన్.ఆర్ *చిత్తూరు*

** ఈ కాలంలో కూడా జ్యోతిష్యాన్ని నమ్మడమా? పెళ్లిళ్లెందుకు విఫలమవుతున్నాయి.*

వివాహ విచ్ఛేదనకు జ్యోతిషం ఒక్కటే కారణం కాదు. సవాలక్ష కారణాలున్నాయి. ఒక శాస్త్రాన్ని విమర్శించే ముందు మీరా శాస్త్రాన్ని అధ్యయనం చేయండి. నేనెప్పటికైనా మీకు సమాధానాలు చెప్పడానికి సంసిద్ధంగా వుంటాను.

జె.జాన్సన్ *కర్నూలు*

** మీ జవాబులు నిక్కచ్చితంగా వుంటున్నాయి. వాస్తు హిందువులకే కదా వర్తిస్తుంది?*

సర్వజనీనమైనది, కుల, మత, వర్గ రహితమైనది, సర్వజన సమ్మతమైనది వాస్తు! వాస్తు సంప్రదింపులు ఈ మధ్యకాలంలో హిందూవేతరులే ఎక్కువగా జరుపుతున్నారు.

సి.పార్థివకుమార్ *నాయుడుపేట*

** మానవ నివాసాలకు సమీపంలో స్మశానం వుండవచ్చా?*

మానవ నివాసాలకు స్మశానాలు ఒకటి నుంచి రెండు మైళ్ల దూరంలో వుండాలి. లేని పక్షంలో ధూమ్ర, పిశాచ వేధలుంటాయని పూర్వ గ్రంథాలు పేర్కొన్నాయి.

కె.శోభారత్నం *సూళ్లూరుపేట*

** యంత్ర ప్రతిష్ట తర్వాత మీరు చెప్పిన రెండు పసుపు మూటలు ఈశాన్యంలో తగిలించాము. మంచి ఫలితాలు వచ్చాయి.*

అవి యంత్ర బలి విధాన, నిదానాలు. అవి వున్న గృహాల్లో శక్తులు వుండలేవు. అందువల్లే మీ చెల్లెల్ని వదలి 'శక్తి' పారిపోయింది. ఆమె మానసిక వ్యాధి నుంచి విముక్తురాలైనందుకు సంతోషం.

సి.శ్రావణినాయుడు *పుల్లంపల్లి*

** 'వృక్షవేధ' వల్ల ఎలాంటి నష్టం కలుగుతుంది?*

పుష్పించే, ఫలించే వృక్షాలనే కాదు, మామూలు చెట్లను తీసివేసిన వారికి శారీరకమైన దుష్ప్రభావాలు కలుగుతాయని ఇరవై ఎనిమిది వాస్తు శాస్త్రాలూ చెప్పాయి.

వై.రమణారెడ్డి *చవటపల్లె*

** వశిష్ట వాస్తు 'ఉదాహరణత్రయి'లో శివుని భిక్ష పాత్రని గురించి చదివాను.*

ఒక సందర్భంలో శివుడు బ్రహ్మ పంచమ శిరస్సును కొనగోటితో ఖండిస్తాడు. అది శివుని భిక్ష పాత్ర అవుతుంది. దీన్ని శంఖువని, ఖర కపాలము(గాడిద పుర్రె) అని కూడా అభివర్ణిస్తారు.

షేక్ షెకావత్ *చెన్నై*

** ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. వాస్తు లోపమా? ఖర్మ ఫలితమా?*

వాస్తు లోపాల్ని ఉత్తరంలో సూచించిన విధంగా సవరించుకోండి. భరణి నక్షత్రానికి ఆధిపత్యం యముడిది గనుక దక్షిణ దిశాభిముఖంతో 'యమ' పూజ, ధ్యానం చేయండి. మీది మేష రాశి. దేవతావృక్షం రక్త చందనం. ఈ వృక్ష బెరడు కషాయాన్ని మందులా స్వీకరించండి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

టి.సుబ్బరాయుడు *కడప*

** సంపాదన వుంది. ఆస్తి వుంది. అయితే ఎప్పుడూ 'మానసిక వేదన' వుంటుంది.*

వాస్తు ప్లాను, జాతకం చూశాను. మీ యింటికి 'దిష్టివేధ' బాగా వుంది. ఉత్తరం వ్రాశాను. ఆ విధంగా చేయండి. పరిష్కారం లభిస్తుంది.

డి.సుబ్బారావు *మార్కాపురం*

** మా బంధువుల్ని పరిశీలించాక ఆడపిల్లే మేలన్న నిర్ణయానికొచ్చాను.*

మీది మంచి నిర్ణయమే. అనాధ శరణాలయాల్లో ఒకరిద్దరు బాలికల్ని దత్తత తీసుకోండి. మీ యింటికి 'కళాకాంతులు' వస్తాయి. సహజంగా స్త్రీలు కన్నవారిని, పెంచిన వారినీ ఎక్కువగా ప్రేమిస్తారు. జ్యోతిషం విషయమై నేను మీకు సహకరిస్తాను.

ఎస్.టి.ఆర్ *తడ*

** అయ్యా కుజ దోషం వున్నదేమోనని అనుమానం. నాకు చాలా భయంగా వున్నది.*

వచ్చిన కోడలి దోషం ఆమె వ్యక్తిగతం. మీపై ఎట్లాంటి ప్రభావం వుండదు. అబ్బాయిపై అసలు వుండదు. దోషం ఆమెకు వున్నా పరిష్కార మార్గాలున్నాయి. ఆ పనిలో నేను మీకు మానవతా దృక్పథంతో సహకరిస్తాను. మీరు భయపడకండి!

ఎస్.ప్రద్యుమ్నరెడ్డి *సూళ్లూరుపేట*

** మా అమ్మాయిది 'పుబ్బ' నక్షత్రం, మృగశిర నక్షత్రం అబ్బాయిది. కుదరదన్నారు.*

'పుబ్బ' వ్యతిరేకం ఆశ్లేష, మృగశిర వ్యతిరేకం కాదు. శాస్త్రం తెలియని వాళ్ల వల్ల కుదిరే సంబంధాలు కూడా చెడి పోతున్నాయి.

గ్రామ పంచాయితీ ఎన్నికల సందడి!

చాలా ఏళ్ల విరామం తర్వాత గ్రామ పంచాయితీల ఎన్నికలు జరుగుతున్నాయి. సర్పంచులతోపాటు వార్డు సభ్యులుగా తమ పార్టీ వారినే గెలిపించుకోవాలని కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపా పార్టీలు తెగ ఉత్సాహపడుతుండడంతో సందడి నెలకొని ఉంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయితీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఈనెల 9న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలు తెలుగుదేశం, కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తులు చేస్తున్నారు. గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేయడంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ముందంజలో వుంది. కోవూరు శాసనసభ్యులు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన నియోజకవర్గ పరిధిలోని పంచాయితీల్లో ముందుగానే సర్పంచ్ అభ్యర్థుల్ని ప్రకటించారు. తెలుగుదేశం, అధికార కాంగ్రెస్ పార్టీలతోపాటు సిపిఎం, సిపిఐ పార్టీల అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు.

గత నాలుగు నెలల నుంచి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఊహాగానాలు వినవస్తూనే వున్నాయి. పంచాయితీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో అనేక ఫిటిషన్లు దాఖలు కావడంతో తీవ్ర జాప్యం జరుగుతూ వచ్చింది. రెండు నెలల క్రితం సుప్రీంకోర్టు 2001 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలుచేసి ఎన్నికలు జరపాలని తీర్పు నిచ్చిన సంగతి తెలిసిందే. అయితే 2011 జనాభా వివరాలు వెల్లడికావడంతో రిజర్వేషన్ ప్రక్రియలో మార్పులు చేయాల్సి వచ్చింది. నెల రోజులపాటు అధికార యంత్రాంగం అతికష్టం మీద ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్లు ఖరారు చేశారు. గ్రామ పంచాయితీతో పాటు వార్డులనూ విభజించారు. కొన్ని పంచాయితీల్లో అధికారులు సక్రమంగా పరిశీలన చేయకపోవడం వల్ల లోపాలు జరిగాయన్న ఆరోపణలు వున్నాయి.

అధికారపార్టీ నేతలు సూచించిన విధంగా కొన్ని సంచాయితీల్లో రిజర్వేషన్లు ఖరారు చేయడంలో అధికారులు అనుకూలంగా వ్యవహరించడంతో లోపాలు బహిర్గతమైనాయి. లోపాలు బయటపడిన ప్పటికి ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో ప్రస్తుతం ఏం చేయలేని పరిస్థితి. ముందుగా ప్రకటించిన విధంగానే ఎన్నికలు నిర్వహించాల్సి వుంటుంది. గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేసేవారికి రాజకీయ పార్టీ చిహ్నాలు దక్కే అవకాశం వుండదు. స్వతంత్ర అభ్యర్థిగానే ఎన్నికల్లో పోటీ చేయాలి. రాజకీయ పార్టీలు మాత్రం సర్పంచ్ అభ్యర్థుల్ని తమ పార్టీ వారని ప్రకటించుకుని ప్రచారం చేసుకోవచ్చు. 940 గ్రామ పంచాయితీల్లో డివిజన్ల వారీగా మూడు దశల్లో ఎన్నికలు జరపనున్నారు. 23వతేది కావలి డివిజన్, 27న నెల్లూరు డివిజన్, 31న గూడూరు, నాయుడుపేట డివిజన్లలో ఎన్నికలు జరుగుతాయి. ఇప్పటికీ అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైంది.

2009 సాధారణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించిన తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో కోవూరు నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత సహకార ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం గ్రామ పంచాయితీ ఎన్నికలు జరుగనుండడంతో అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని తమ సత్తాచాటాలని ప్రయత్నిస్తున్నాయి. ఎన్నికల ప్రచారం కేవలం గ్రామాలకే పరిమితం కావడంతో ఆయా మండలస్థాయి నేతలకు తమ అభ్యర్థుల్ని గెలిపించుకునే బాధ్యతలు అప్పగిస్తున్నారు. పంచాయితీ ఎన్నికల్లో అధిక స్థానాలు కైవసం చేసుకుంటే మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో విజయం సాధించవచ్చన్నది రాజకీయ నేతల అభిప్రాయం. గ్రామ పంచాయితీ పరిధిలోని వార్డుల్లో సభ్యులను ఎంపిక కొంత ఇబ్బందికరంగా మారింది. స్థానికంగా రాజకీయ విభేదాలున్నాయి. రాజకీయ పార్టీలు వార్డు సభ్యుల విషయంలో తర్జన భర్జన పడుతున్నాయి.

ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వు చేసిన గ్రామ పంచాయితీల వార్డుల్లో పోటీ చేసే వారికి మొత్తం ఖర్చును పార్టీలే భరించేందుకు ముందుకు వస్తున్నాయి. చాలా సంవత్సరాల తర్వాత గ్రామ పంచాయితీ ఎన్నికలు జరుగనుండడంతో ఏ గ్రామంలో చూసిన వాడివేడి చర్చలు జరుగుతున్నాయి. గ్రామాల్లో రాజకీయ పార్టీ నేతలు పర్యటించి చర్చలు జరపడం కోలాహలంగా మారింది.

ఇదేమి సేవ!


నత్తనడకన మీ-సేవా కేంద్రాలు!

- **జిల్లాలోని మీ-సేవా కేంద్రాల్లో సేవలు నత్తనడకను గుర్తుకు తెస్తున్నాయి.**
- **విధిస్తున్న ఆంక్షలు తలనొప్పి తెస్తున్నాయి.**
- **ఉన్నతాధికారులు మీ-సేవా కేంద్రాలను సంస్కరించాల్సి వుంది.**

మీ-సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు మరెన్ని సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతోంది. తొలుత ఈ సేవా కేంద్రాలు ఏర్పాటుచేసిన ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యంతో మీ సేవా కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 46 మండలాల తహశీల్దార్ల కార్యాలయాలతోపాటు ప్రైవేటుగా అనేక మీ సేవా కేంద్రాలు పని చేస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అందించే అన్ని ధృవీకరణ పత్రాలను మీ-సేవా కేంద్రాల ద్వారా పొందాలని ప్రభుత్వం సూచించింది. కానీ మీ-సేవా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ నిర్ణీత కాలవ్యవధిలో దరఖాస్తులను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అత్యవసర ధృవీకరణ పత్రాలు కావలసిన వారు ఇబ్బంది పడక తప్పదం లేదు. సిబ్బంది తీరును నిరసిస్తూ అధికారులకు విషయం తెలిపినప్పటికీ ఎటువంటి ప్రయోజనం వుండడం లేదని ప్రజలు వాపోతున్నారు.

మీ సేవా కేంద్రాల ద్వారా ఆదాయ, కులం, పుట్టినతేది, మరణ ధృవీకరణ పత్రాలను అధికంగా దరఖాస్తు చేస్తుంటారు. దరఖాస్తుతోపాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు గతంలో పొందిన కుల ధృవీకరణ పత్రం జెరాక్స్ కాపీలను జత చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో స్వీకరించిన దరఖాస్తుల్ని సంబంధిత తహశీల్దారు కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా పంపుతారు. వినియోగదారుడికి ఇస్తున్న రశీదులో 30 రోజులు వ్యవధిగా నిర్ణయిస్తున్నారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో వున్న మీ-సేవా సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించి నిర్ధారించేందుకు కేవలం 20 నిమిషాల వ్యవధి పడుతుంది. కానీ 30రోజుల తర్వాత ధృవీకరణ పత్రాలు అందిస్తామని చెబుతుండడంతో ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుకుబడి కలిగిన వ్యక్తులు దరఖాస్తు చేసిన రెండు రోజుల్లో ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలను పొందగలగుతున్నారు. ఎటువంటి పలుకుబడిలేని వారు మాత్రం నెలరోజులు నిరీక్షించక తప్పడం లేదు.

ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో కళాశాలలు, పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు తప్పని సరిగా ఎస్సీ, ఎస్టీ, బిసిలు ఆదాలయ, కుల ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి వుంటుంది. మీ-సేవా కేంద్రాల సిబ్బంది నెల రోజులు వ్యవధి విధిస్తుండడంతో విద్యార్థులు ప్రవేశం పొందేందుకు అధిక ఫీజు చెల్లించాల్సి వస్తుందని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీ-సేవా కేంద్రాల సిబ్బందిని ఈ విషయంపై ప్రశ్నిస్తే తహశీల్దార్ కార్యాలయంలో నిర్ధారణ జరగడంలో ఆలస్యం జరుగుతోందని, అక్కడ నుంచి ఎప్పుడు అనుమతి లభిస్తే వెంటనే ధృవీకరణ పత్రాలు జారీ చేస్తామని అంటున్నారు. మీ-సేవా కేంద్రాల నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజువారీగా ఎన్ని దరఖాస్తులు అందుతున్నాయి? వీటిలో ఎన్ని పరిష్కరిస్తున్నారు? ఎందుకు ఆలస్యం జరుగుతుందన్న వివరాలు సేకరించడం లేదు. కొన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో సిబ్బంది మామూళ్లు తీసుకొని ధృవీకరణ పత్రాలు అందిస్తున్నారని ప్రచారం జరుగుతుంది.



నెల్లూరులోని మీ-సేవా కేంద్రం.

ఆరునెలలకు కులం మారుతుందా?

కుల ధృవీకరణ పత్రాల కోసం గతంలో తహశీల్దార్ జారీచేసిన ధృవీకరణ పత్రం జెరాక్స్ కాపీని జతచేస్తే సిబ్బంది నిరాకరిస్తున్నారు. ఆరు నెలల వ్యవధిలో పొందిన పత్రాల జెరాక్స్ కాపీలను జత చేయాలని లేదా విద్యార్థుల ధృవీకరణ పత్రం (టి.సి) జత చేయాలన్న నిబంధన విధిస్తున్నారు. విద్యార్థులుగా వున్నవారికి టిసిలుంటాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకొనే వారికి టి.సిలు ఎక్కడ నుండి వస్తాయో సిబ్బందికే తెలియాలి. ఒక వ్యక్తి కులం ఎప్పటికి మారే అవకాశం వుండదు. ప్రతి సంవత్సరం ఆదాయంలో మార్పులు వుంటాయే తప్ప కులంలో తేడాలుండవు. తహశీల్దార్లు నేరుగా జారీ చేసిన కులం ధృవీకరణ పత్రాలు జత చేస్తే అనుమతించకపోవడం విశేషం. ఆరు నెలలు వ్యవధిలోగాని, భవిష్యత్‌లో గాని కులం మారదన్న విషయాన్ని సంబంధిత అధికారుల సిబ్బందికి వివరించాలి.

అలాగే ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించే మీ-సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. ఓటరు గుర్తింపు కార్డు పొందేందుకు ప్రభుత్వం ఫీజు 10 రూపాయలు నిర్ణయించింది. కానీ ఇందుకు భిన్నంగా 20 రూపాయలు వసూలు చేస్తున్నారు. వసూలు చేసిన ఫీజుకు ఎటువంటి రశీదు కూడా ఇవ్వకపోవడం విమర్శకు దారి తీస్తుంది.



మేము విడిపోలేదు!

అందాల భామ దీపికా పదుకొణె 'యే జవానీ హైదీవానీ' విజయంతో ఆనందోత్సాహాల్లో ఉంది. ఈ హిందీ చిత్రంలో రణ్‌బీర్ కపూర్‌తో ఆడిపాడింది. కొన్నేళ్ల క్రిందట వీళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఆ తర్వాత దూరమయ్యారు. వీళ్లు విడిపోవడానికి రణ్‌బీర్ తల్లి కారణమంటారు. ఈ మాటల్ని ఆయన ఖండించారు. అయితే తామిద్దరం అందరూ అనుకొన్నట్లు ముఖం ముఖం చూసుకోనంతగా ఏమీ విడిపోలేదని దీపిక చెబుతోంది. యే జవానీ...కి ముందు కూడా నేను, రణ్‌బీర్ అప్పుడప్పుడూ ఫోన్‌లో మాట్లాడుకొంటూనే ఉండేవాళ్లం. సినిమా కబుర్లే ఎక్కువ. అతను నాకు చాలా విషయాల్లో సలహాలిచ్చేవాడు. అలాగని మా మధ్య ఓ బాయ్ ఫ్రెండ్, గాళ్ ఫ్రెండ్ బంధం ఏదో ఉందని ఊహించుకోవద్దు. మేం మంచి స్నేహితులమని గట్టిగా చెప్పగలను అంటోంది దీపిక.



జలజలా కన్నీళ్లు



కెమెరా ముందు కన్నీళ్లు రావాలంటే ఏం చేయాలి? ఈ ప్రశ్నను మన నటీనటుల ముందుంచితే గ్లిజరిన్ రాసుకోవాలని సమాధానం చెబుతారు. సోనమ్‌కపూర్‌కి మాత్రం ఆ అవసరమే లేదట. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ గ్లిజరిన్ రాసుకోకుండానే అవే వచ్చేస్తాయి. దర్శకుడు చెప్పే సన్నివేశంలో లీనమైతే చాలు... నాకు కన్నీళ్లొచ్చేస్తాయి. అయితే ఆ సన్నివేశంలో నిజంగా భావోద్వేగాలుండాలి. ఒకవేళ రాలేదంటే మరోసారి టూకీగా కథ చెప్పమంటాను. వెంటనే అందులోని భావోద్వేగాలు నా మనసులో నాటుకు పోతాయి. కన్నీళ్లొచ్చేస్తాయి. వాటితోపాటే సహజమైన నటన కూడా బయటకు వస్తుందని చెబుతోంది సోనమ్.

అఖిల్ వస్తున్నాడు!



సిసింద్రీ అఖిల్ వెండితెర ఎంట్రీకి అంతా సిద్ధం అవుతుందా? తెర వెనుక ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయా? నాగార్జున మాటలు వింటుంటే అదే నిజం అనిపిస్తోంది. ఇటీవల జరిగిన 'అడ్డా' ఆడియో వేడుకలో అఖిల్ ఎంట్రీ గూర్చి సూచాయిగా చెప్పాడు నాగార్జున. వచ్చే యేడాది అఖిల్ సినిమా ఆడియోకు మీరంతా తప్పకుండా రావాలి అని అభిమానులను ఉత్సాహ పరిచాడు. అఖిల్ కూడా సినిమాలకు తగ్గట్టు సంపూర్ణంగా సిద్ధం అవుతున్నాడు. నటన అఖిల్‌కు కొత్త కాదు. ఊహ తెలియనప్పుడే కెమెరా ముందుకొచ్చాడు. ఆ తర్వాత కొన్ని లఘు చిత్రాల్లో నటించాడు. నాట్యం, నటన విభాగాల్లో ప్రత్యేక శిక్షణ కూడా తీసుకొన్నాడు. అఖిల్ ఎంట్రీపై కొంత కాలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. నాగార్జున వ్యాఖ్యలతో 2014లో అఖిల్ గ్యారెంటీగా వచ్చేస్తున్నాడు అనే విషయం రూఢీ అయ్యింది.

జోష్‌తో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది హీరోయిన్ కార్తీక. దమ్ములో ఎన్టీఆర్‌తోనూ నటించింది. ఆ తర్వాత తెలుగులో ఆమెకు చెప్పుకోదగిన అవకాశాలు రాలేదు. దాంతో తమిళ చిత్రసీమపైనే దృష్టి పెట్టింది. ప్రస్తుతం అక్కడ భారతీరాజా దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తోంది. నిర్మాత కూడా ఆయనే. గత రెండేళ్ల నుంచీ చిత్రీకరణ సాగుతూనే వుంది. తమిళనాడులోని ఓ మారుమూల గ్రామానికి చెందిన యువతి కథ ఇది. ఈ సినిమాలో కార్తీక ఓ గిరిజన యువతిగా నటిస్తుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రచార చిత్రాలు ఇటీవలే బయటకు వచ్చాయి. అందులో వీపుపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా కనిపిస్తోంది కార్తీక. ఈ ట్రైలర్లు ప్రస్తుతం తమిళనాట హాట్ టాపిక్‌గా మారాయి.

దేనికైనా రెడీ!

నేను ఎలాంటి పాత్రలకైనా రెడీ అంటోంది కార్తీక.

సిద్ధార్థ్ వాచాలత్వం



యువ కథానాయకుడు సిద్ధార్థ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లోకి ఎక్కాడు. తెలుగు ప్రేక్షకులకు సినిమాలు చూడడం రాదు. స్టార్ హీరోల సినిమా తప్ప మరొకటి వాళ్లకు నచ్చదు. అంటూ తమిళ మీడియా ముందు వాపోయాడు సిద్ధార్థ్. తను నటించిన 'సమ్‌థింగ్ సమ్‌థింగ్' సినిమాకు తెలుగులో సరైన ఫలితం దక్కలేదు. తమిళంలో కొన్ని డబ్బులొచ్చాయి. అందుకే తన గోడు అలా వెళ్లగక్కాడట. ఆ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో కాస్త వెనక్కి తగ్గాడు. అబ్బే నేను అలా అనలేదు. నా మాటలు వక్రీకరించారు. నేనీస్థాయిలో ఉండడానికి తెలుగు వాళ్లే కారణమని ట్విట్టర్‌లో సందేశం పంపాడు.

సక్సెసే నిలబెడతాయి



మార్కెట్‌ను విస్తరించుకోవాలనే ఆలోచనల్లో యువ హీరోలుంటే తెలుగు సినిమాల్లోనే నటిస్తానని హీరో మహేష్‌బాబు పరిధి విధించుకొన్నాడు. దూకుడు, బిజినెస్‌మేన్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి వరుస చిత్ర విజయాలతో హుషారవుతున్న ఆయన వన్ సినిమా షూటింగ్ గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడారు. కెరీర్ సజావుగా సాగాలంటే సక్సెస్‌లు కొట్టాల్సిందే. ఆ విషయంలో ప్రస్తుతం నేను హ్యాపీగా ఉన్నా. మంచి కథలు వస్తున్నాయి. వాటికి నా వంతు న్యాయం చేస్తున్నా. వరుసగా మూడు చిత్రాలు విజయం సాధించడం ప్రణాళికతో సాధ్యపడలేదు. దర్శకులే విజయాలు అందించారు. సెట్‌కు వెళ్లాక దర్శకులు ఏం చెప్తారో అది చేస్తానంతే అన్నాడు మహేష్‌బాబు.

తేడా లేదు!



హీరోయిన్ కాజల్ తెలుగు, తమిళ, హిందీ భాషా చిత్రాల్లో నటించింది. ఉత్తరాది, దక్షిణాది ప్రేక్షకుల మధ్య తేడా ఏమైనా ఉందా అంటే; ఇది వరకు ఉత్తరాది, దక్షిణాది ప్రేక్షకుల అభిరుచుల్లో తేడాలుండేవి. ఇప్పుడు అలా కాదు. సినిమా అనేది ఎక్కడైనా ఒక్కటే. సినీస్టార్లకు దక్కే ఆదరణ ప్రతి చోటా ఇంచుమించు ఒకేలా ఉంటోంది. నటీనటుల్ని వెండితెరపై స్టార్లుగా చూడాలనుకొంటారు. హీరోయిన్లు ఫిట్‌గా ఉంటే ఇష్టపడతారు. పక్కింటి అమ్మాయి పాత్రలే అయినా అందంగా ముస్తాబు అవ్వాలి. పాత్రకు అనుగుణంగా నడుచుకొంటూనే అతిలోక సుందరిగా కనిపించాలి. అలా ఉంటేనే ప్రేక్షకులకు తొందరగా చేరువ కావచ్చుంటుంది కాజల్.



తమిళంలో తెలుగమ్మాయి

ఆవకాయ్ బిర్యానీలో హీరోయిన్, అచ్చ తెలుగమ్మాయి బిందు మాధవికి తెలుగు పరిశ్రమలో అంతగా కలసి రాలేదు. దీంతో క్రమంగా తమిళ చిత్ర పరిశ్రమవైపు దృష్టి సారించింది బిందు. అక్కడ మాత్రం ఈ అమ్మడికి బాగానే కలిసొచ్చింది. వరుసగా అవకాశాలను అందుకొంటోంది. ప్రస్తుతం దేశింగు రాజా అనే చిత్రంలో నటిస్తోంది. భవిష్యత్తులో అవకాశాలకు కొదవుండ కూడదని అందాల ఆరబోతకూ సిద్ధమే అని ప్రకటిస్తోంది. దీంతో మరిన్ని సినిమాలు ఈ అమ్మడి చేతికొస్తున్నాయి. ఈ విషయమై బిందు మాట్లాడుతూ అందంగా కనిపించడానికి నాకెలాంటి అభ్యంతరాలు లేవు. నా అభిమాన హీరోయిన్ సిల్క్ స్మిత. చిన్నప్పుడు నా చూపులు అచ్చం ఆమెలానే ఉంటాయని అనేవారు. తెరపై కూడా ఆమెలా కనిపించడానికి నేను ఇష్టపడతానని చెప్పుకొచ్చింది.

గంటి ప్రసాదం హత్య నయీం ముఠా పనా?





టార్గెట్ ప్రసాదం, కళ్యాణరావు, వరవరరావు

నెల్లూరు నగరంలో మావోయిస్టు మాజీ నేత, అమరవీరుల బంధుమిత్రుల గౌరవ అధ్యక్షుడు గంటి ప్రసాదంపై జరిపిన దాడి వెనుక నయీం ముఠా ప్రమేయం వుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు మావోయిస్టు పార్టీలో పనిచేసిన నయీం ఐపిఎస్ అధికారి వ్యాస్ హత్యలో నిందితుడు. బెయిల్‌పై బయటకు వచ్చిన అతను పోలీసు కోవర్టుగా మారాడు. పోలీస్ బాస్‌ల సహకారంతో మావోయిస్టుల హత్యకు పథకం రచించేవాడన్న ఆరోపణలున్నాయి. పౌరహక్కుల సంఘం నేతల హత్యలో నయీం ముఠా హస్తం వుందన్న సంగతి పోలీసులకు తెలుసునని హక్కుల నేతలు గుర్తు చేస్తున్నారు. ఈ నెల 4న నగరంలో జరిగే అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొనేందుకు నెల్లూరుకు వచ్చిన ప్రసాదంను కత్తితో నరికి ఆపై మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. 10 గంటల పాటు మృత్యువుతో పోరాడి చివరికి ప్రాణాలు వదిలారు. పోలీసులకు తప్ప ప్రసాదంను హత్యచేసే అవసరం ఎవరికీ లేదని ప్రజా సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.

టార్గెట్ ముగ్గురు?

టౌన్‌హాల్లో నిర్వహించే కార్యక్రమాలకు హాజరయ్యే విరసం నేతలు వరవరరావు, కళ్యాణరావు, గంటి ప్రసాదంలను హత్య చేయాలని దుండగులు లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిసింది. అనారోగ్య కారణంచేత వరవరరావు హాజరు కాలేకపోగా, కళ్యాణరావు, గంటి ప్రసాదంలు హాజరయ్యారు. గంటి ప్రసాదంతో పాటు కళ్యాణరావు కూడా నెల్లూరు ఆసుపత్రికి వెళ్లి వుంటే మరో ఘోరం జరిగి వుండేదని కొందరు అంటున్నారు. ప్రసాదం ఒక్కరే ముఖ్య నేత కావడంతో ఆయనపై కాల్పులు జరిపి గుర్తు తెలియని వ్యక్తులు పారిపోయారు. నెల్లూరు నగరంలో కాకపోయినా సభ ముగిసిన తర్వాత ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ దాడిచేసి హతమార్చాలన్న లక్ష్యంతో రంగంలోకి దిగినట్లు సమాచారం. ప్రసాదం హత్యపై ఇప్పటివరకు పోలీసులు ప్రాథమిక సమాచారం సేకరించిన దాఖలాలు కనిపించలేదు. పౌరహక్కుల సంఘం నేతలు పోలీసుల హస్తం వుందన్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు ఎటువంటి ప్రయత్నం జరగడం లేదు.

భారీ బందోబస్తు

దుండగుల చేతిలో హత్యకు గురైన గంటి ప్రసాదం మృతదేహానికి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు. నారాయణ ఆసుపత్రి నుండి తీసుకొచ్చిన మృతదేహానికి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శశికాంత్, శ్రీధర్‌లు శవపరీక్ష పూర్తి చేశారు. గంటి ప్రసాదంపై కాల్పులు జరిగినప్పటి నుండి నారాయణ ఆసుపత్రి, జిల్లా ప్రభుత్వాసుపత్రి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి, సివిల్ దుస్తుల్లో ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి అధికారులను నిఘా వుంచారు. ఆసుపత్రి వద్దకు వచ్చిన ప్రతి వాహనం నెంబరును నమోదు చేసుకోవడం, మీడియా చిత్రీకరణ చేయడం కనిపించింది. బయట ప్రాంతం నుండి అభిమానులు, భారీ సంఖ్యలో తరలి వచ్చిన సన్నిహితుల వివరాలు రహస్యంగా నమోదు చేసుకుని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే పనిలో నిమగ్నమైనారు. శ్రీకాకుళం నుండి ప్రసాదం సతీమణి రాజేశ్వరమ్మ, మద్రాసు నుండి కుమారుడు సుధీర్, హైదరాబాద్ నుండి పద్మకుమారి, ఇతర ప్రజా సంఘాల నేతలు పెద్దాసుపత్రి వద్దకు చేరి నివాళులర్పించారు. ప్రత్యేక అంబులెన్స్‌లో విజయనగరం జిల్లా బొబ్బిలికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

● స్థానిక ఎన్నికల్లో

యువతకే ప్రాధాన్యం!

తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు బీద రవి



రాబోయే స్థానిక సంస్థలు, నగర పాలక సంస్థల ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేస్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ప్రకటించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో దాదాపు 50 శాతం సీట్లు యువతకే కేటాయిస్తున్నారు. ఇటీవల పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన సందర్భంగా నగరంలో భారీ ప్రదర్శన, ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాల భ్రష్టుపట్టించిందని విమర్శించారు. మరోవైపు తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని వేల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన వైఎస్ జగన్ అమాయకుడని ఆ పార్టీ నేతలు చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వమని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవినీతి పార్టీ అని ఈ రెండింటి సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పనున్నారన్నారు.

పంచాయితీ ఎన్నికలకు సర్వం సిద్ధం!

ఏదో ఒక గుర్తింపు కార్డుతో ఓటు వేయవచ్చు


జెసి లక్ష్మీకాంతం.

ఈ నెలలో జరుగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికలకు అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసిన మరుసటి రోజు నుండి ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితా బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోలింగు కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు, సిబ్బంది నియామకం తదితర ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించే పంచాయితీ ఎన్నికల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహించని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలవారీగా ఓటరు జాబితాను మరోసారి పరిశీలించి సిద్ధంగా వుంచాలని కోరారు. ఎన్నికల్లో విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది వివరాలు పంచాయితీ అధికారుల వద్ద అందుబాటులో వుండే విధంగా చూసుకోవాలని సూచించారు. గోల్డెన్‌జూబ్లీ హాల్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పంచాయితీ ఎన్నికల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే ఓటు వేసేందుకు ప్రతి ఒక్కరికి ఓటరు గుర్తింపు కార్డు కలిగి వుండాలన్న నిబంధన అమలయ్యే అవకాశం కనిపించడం లేదు. ఎందుకంటే అనేక మంది గుర్తింపు కార్డులు అందించడంలో రెవిన్యూ అధికారులు వైఫల్యం చెందుతున్నారు. దీంతో ఏదో ఒక గుర్తింపు కార్డును చూపితే ఓటు వేసేందుకు అనుమతినిస్తారని కొందరు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.


ప్రజాదీవెన కార్యక్రమంలో అనిల్‌కుమార్ యాదవ్.

రాబోయే పంచాయితీ మరియు కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని ఆ పార్టీ నెల్లూరు నగర సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజాదీవెనలో భాగంగా 42వ డివిజన్‌లోని గిడ్డంగివీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సుభిక్షంగా వున్నారన్నారు. ప్రస్తుత పాలకుల తీరు కారణంగా దుర్భర బతుకులు సాగిస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డిని ముఖ్య మంత్రిని చేస్తేనే రాజన్న పాలన మళ్లీ వస్తుందన్నారు. రాబోయే ఎన్నికలలో ఎవరు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, భయాందోళనలకు గురిచేసినా ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులను గెలిపించుకొంటారన్నారు. మరో ఆరు నెలలు మాత్రమే అధికారంలో వుండబోయే పార్టీని నమ్ముకొని అధికారులు ఈ ఎన్నికలలో అవకతవకలకు పాల్పడితే అధికారులు ఇబ్బందులు పడతారన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పసాని శ్రీనివాసులు, మజ్జిగ జయకృష్ణారెడ్డి, మేడల విజయకుమార్, సురేంద్ర, భాస్కర్, సయ్యద్ రాజు, రవి, శేషగిరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీలు వైకాపావే!

నెల్లూరులో అనిల్ ప్రకటన

జ్ఞాపకశక్తిపై శిక్షణ!

రోటరీ క్లబ్ నెల్లూరు ఆధ్వర్యంలో రొటేరియన్ సనత్‌కుమార్‌రెడ్డి జ్ఞాపకశక్తి పెంపొందించుకొనే మార్గాలపై జూన్ 25వ తేది నుండి జూలై 6వ తేది వరకు వివిధ స్కూళ్లు, కాలేజిలో 400 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పునశ్చరణ పద్ధతులు, కష్టమైన విషయాలను గుర్తు పెట్టుకోవడానికి జ్ఞప్తి చిహ్నాలను ఏర్పరచుకోవడం, ఎక్కువ కాలం గుర్తు పెట్టుకొనే విధానం, ఆక్రోసిమ్ పద్ధతి ద్వారా కష్టమైన విషయాలను గుర్తు పెట్టుకోవడం, ఎక్కువ పదాలను ఒకేసారి గుర్తు పెట్టుకొనేందుకు లింక్ పద్ధతి మరియు పెద్ద సంఖ్యలను గుర్తు పెట్టుకొనేందుకు పెగ్ సిస్టమ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ రోజుకు గంట చొప్పున ఎనిమిది రోజులు జరిగింది. శిక్షణ పొందాలని భావించిన వారు 94418 54387 నెంబరులో సంప్రదించవచ్చు.

అంతా మీ యిష్టం... స్వేచ్ఛ ఇచ్చేశాం!

బిజెపి జిల్లా నాయకత్వం స్వేచ్ఛా రాగం అందుకొంది. వర్గాలు, గ్రూపులు, కుమ్ములాటలతో వుండే పార్టీలో ఇటీవల నేతలు ఐక్యతారాగం ఆలపిస్తున్న సంగతి తెలిసిందే. పంచాయితీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి ఈ స్వేచ్ఛాగీతం అందుకొన్నాడు. పంచాయితీలో ఎన్నికల పరిస్థితులు, స్థానిక సమీకరణల దృష్ట్యా ఎక్కడికక్కడ పార్టీ ఎవరితోనైనా పొత్తు పెట్టుకోవచ్చని, దీనిపై మండల పార్టీకి స్వేచ్ఛ ఇస్తున్నామని అధ్యక్షుల వారు ప్రకటించారు. ఎన్నికల్లో పార్టీని గెలిపించే దిశగా ఈ నిర్ణయం తీసుకొన్నామని సెలవిచ్చారు. ఇంకేముంది జిల్లా అధ్యక్షుడు, ఇతర సీనియర్ నేతలు స్వేచ్ఛగా ఎవరితోనైనా అక్రమ రాజకీయ సంబంధాలు పెట్టుకోండి, వాటిని సక్రమ సంబంధాలుగానే భావిస్తామని చెప్పడంతో కార్యకర్తలు సంబరపడి పోతున్నారు. ఉత్సాహంగా ఎన్నికల కదన రంగంలోకి దూకేందుకు సన్నద్ధమవుతున్నారు.

సమస్యలూ నాలుగే

16వ పేజీ కొరవ

కేంద్రాలు సమస్యలలో పడుతాయి. ఇప్పటి వరకు బొగ్గు వారిది, విద్యుత్ మనది. ఇక నుంచి ఆ రెండూ వారికే అధిక భాగం దక్కు తాయి.

జల విద్యుత్ విషయంలోనూ ఇదే సమస్య. శ్రీశైలం, నాగార్జునసాగర్ కుడి వైపున విద్యుత్ కేం ద్రాలు తెలంగాణ ప్రాంతంలోకి వస్తాయి. రాయల తెలంగాణ అయితే శ్రీశైలం రెండు ప్రక్కలా అటే పోతాయి. జలవిద్యుత్ చాలా చవకగా లభించే సహజ వనరు. అందులో ఆంధ్ర వాటా భాగా తగ్గి పోతుంది.

ఉద్యోగాలలో మనదే ప్రధాన వాటా

హైదరాబాదులో ప్రధాన పరిశ్రమలన్నీ ఆంధ్ర ప్రాంతం పారిశ్రామికుల యాజమాన్యంలోనే వున్నాయి. అందువల్ల సహజంగా వాటిలో పని చేసే వారు కూడా మన వాళ్లే. ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా ఇదే పరిస్థితి. హైదరాబాదులో పని చేసే సర్కారు ఉద్యోగులలో 70శాతం మంది ఆంధ్రులు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే ప్రభుత్వ ఉద్యోగ అవకా శాలలో మన వాటా క్షీణించి పోతుంది. ప్రైవేటు పరిశ్రమలలో కూడా ఆంధ్ర నుంచి ఉద్యోగాలను నియమించుకోవడాన్ని వారు అభ్యంతర పెడతారు. ఇప్పటికే ఈ సమస్య వుంది.

తెలంగాణ ఏర్పడితే హైదరాబాద్ నగర అభివృద్ధి తిరోగమన బాట పట్టడం ఖాయం. కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు ఆంధ్ర ప్రాంతానికి తరలిపోతాయి. జనాభా కూడా తగ్గుతుంది. అందువల్ల ఆస్తుల విలువ క్షీణిస్తుంది. హైదరాబాద్ నగరంలోని మొత్తం ఆస్తులలో 70 నుంచి 80 శాతం వరకు ఆంధ్ర ప్రాంతం వారివే కావడం గమనార్హం. అందువల్లనే లగడపాటి వంటి వారు జగడపాటిగా మారి గోల చేయడం.

మావోయిస్టులకు స్వాతంత్ర్యం

తెలంగాణ మొదటి నుంచి నక్సల్స్‌కు కేంద్ర స్థానం. శ్రీకాకుళంలో తొలి రైతాంగ పోరాటం ప్రారంభమైనా, నక్సల్స్‌కు స్థిరమైన స్థావరం మాత్రం ఉత్తర తెలంగాణ. అందుకు చాలా చారిత్రక, రాజ కీయ, ఆర్థిక, సామాజిక కారణాలున్నాయి. నిజాం కాలంలో నడిచిన ఫాసిస్ట్ పాలన వల్ల ఈ ప్రాంతం గ్రామాలలో బడుగు జీవుల మీద భూస్వాములు దౌర్జన్యాలు యదేచ్ఛగా సాగాయి. ఆ కథలు వింటే కన్నీళ్లు రావడం కాదు, భూస్వామ్య వ్యవస్థ మీదనే అసహ్యం, ద్వేషం పుడుతుంది. అమాయక దళి తులు, గిరిజనుల మీద అక్కడ జరిగే అకృత్యాలను నక్సలైట్లు నూటికి నూరు శాతం నిరోధించారు. అందువల్లనే తెలంగాణ ప్రజలలో వారి పట్ల ఆరా ధనా భావం వుంది. అయితే మారిన కాల పరిస్థి తుల వల్ల, గ్రామాలలో పెరిగిన ఉపాధి అవకాశాల వల్ల, జీవన ప్రమాణాల వల్ల ప్రస్తుత యువతరం విప్లవోద్యమాల పట్ల ఆకర్షితులు కావడం లేదు. మరొకప్రక్క పోలీసు కూడా సమర్ధవంతంగా వారిని అణిచి వేసింది. దానితో నక్సలైట్లు ఉత్తర తెలంగా ణను వదలిపెట్టి, చత్తీస్‌ఘడ్‌కు వలస వెళ్లారు. తెలంగాణ రాష్ట్రం అంటూ ఏర్పడితే నక్సలైట్లు మరొక సారి విజృంభిస్తారన్నది హోం శాఖ అభిప్రాయం. ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా ఇదే భావనతో వున్నాడు.

కుల సమీకరణలు

మొదటి పేజీ కొరవ

గోలు, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలు పూర్తిగా రెడ్ల పెత్తనంలో నడుస్తాయి. గుం టూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాలలో రెడ్లు, కమ్మ సరిసమానంగా వుంటారు. కృష్ణలో కమ్మ ఆధి పత్యం ఎక్కువ. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో కమ్మ, కాపు, రాజులు వున్నారు. ఉత్తరాంధ్రలో బిసి కులాల ప్రాశస్త్యం ఎక్కువ. ఆంధ్ర ప్రాంతంలో మాలలు ఎక్కువ. తెలంగాణలో మాదిగలు ఎక్కువ.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే రెడ్ల ఆధిపత్యానికి గండి పడుతుంది. వెలమలు, బిసి కులాల వారు పైచేయి సాధిస్తారు. అదే రాయల తెలంగాణ అయి తేనే రెడ్లకు ఉనికి వుంటుంది. ఆంధ్రలో రెడ్లు చెప్పు కోదగిన జిల్లాలను నియంత్రిస్తున్నప్పటికీ ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో ఎమ్మెల్యేల సంఖ్య ఎక్కువ కాబట్టి కాపుల ప్రాబల్యం పెరుగుతుంది. రెండు చోట్ల నష్ట పోబోయేది కమ్మ కులస్తులే. ఏ రాష్ట్రంలోనూ వారికి ఆధిపత్య స్థానం మిగలదు.

ఈ మారుతున్న కుల సమీకరణల వల్లనే చాలా మంది రాజకీయ వాదులు రాష్ట్ర విభజనకు వ్యతిరేకిస్తున్నారు. అది వారి మనసులోని మాట. రాయల తెలంగాణ అంటూ ఏర్పడితే మొదటగా నష్టపోయేది వైఎస్ జగన్. కర్నూలు, అనంతపురం జిల్లాలలో ఆయన పార్టీకి మంచి పట్టు వుంది. కానీ తెలంగాణాలో ప్రాబల్యం లేదు. అందువల్ల ఆ రెండు జిల్లాలను గెలుచుకొన్నా అధికారం చేజి క్కదు. ఆంధ్ర ప్రాంతంలో రాష్ట్ర విభజన వల్ల కాపుల ప్రాబల్యం పెరిగితే, నెల్లూరు, ఒంగోలు, చిత్తూరు, గుంటూరు జిల్లాలలో గణనీయమైన స్థానాలు గెలుచుకొన్నా అధికారానికి కావలసిన మెజార్టీ దక్కదు. రెండింటికీ చెడిన రేవడిగా మిగిలి పోతుంది వారి పార్టీ. అందువల్లనే రాయల తెలంగాణ అన గానే ఆ పార్టీ ఎమ్మెల్యేలు సమైక్యాంధ్ర ఉద్యమం లోకి అడుగు పెట్టేశారు. రాజీనామా చేస్తామనే బెది రింపులు మొదలు పెట్టారు.

మార్గాలు నాలుగు

మొదటి పేజీ కొరవ

మద్రాసుకే తమ వ్యవహారాలను పరిమితం చేసు కొనే వాళ్లు. మద్రాసు నుంచి సినిమా పరిశ్రమ తర లింపు జరిగిన తర్వాత మాత్రమే ఆంధ్ర ప్రాంతీ యులు హైదరాబాద్ వైపు దృష్టి సారించారు. అక్కడ ఆంధ్రులు ఆస్తులు పెంచుకోవడం గత ముప్పయ్యేళ్ల పరిణామం మాత్రమే. అందువల్ల హైదరాబాద్ మీద తమకు హక్కు వుందని ఆంధ్ర ప్రాంతం నేతలు చేస్తున్న వాదనలలో పటుత్వం లేదు.

ఉమ్మడి రాజధాని

ఆంధ్ర ప్రాంతం నేతలు తెలంగాణను గట్టిగా వ్యతిరేకించడానికి ప్రధాన కారణం – హైదరాబాద్ నగరం మీద వున్న ప్రేమ. ఆంధ్ర ఉద్యమ నేతలు కావూరి సాంబశివరావు, లగడపాటి రాజగోపాల్, రాయపాటి సాంబశివరావు, గాదె వెంకటరెడ్డి వంటి వారు ఇక్కడ విపరీతంగా ఆస్తులు కూడ బెట్టారు. ఆంధ్రా నుంచి వచ్చి స్థిరపడిన ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ వంటి ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు కూడా ఇళ్లో, స్థలమో కొనుక్కొని వున్నారు. తెలంగాణ ఏర్ప డితే వాటి విలువ పడి పోతుందన్నది భయం. అందువల్ల రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ నగరాన్ని కొనసాగించాలని కోరుతు న్నారు. అయితే అందుకు అటు టిఆర్ఎస్, ఇటు మజ్లిస్ కూడా వ్యతిరేకం. ఉమ్మడి రాజధానిగా ప్రక టిస్తే, తెలంగాణ ఇచ్చినా ఫలితం దక్కకపోవచ్చు. ఆందోళన అట్లనే కొనసాగవచ్చు.

రాయల తెలంగాణ

ఇది మజ్లిస్ పార్టీ చేసిన ప్రతిపాదన. వారి ఉద్దేశం తమ పార్టీని ఒక ప్రాంతీయ పార్టీగా విస్తరించుకోవడం. ముస్లిం జనాభా అధికంగా వున్న జిల్లాలను కలిపితేనే అది వీలౌతుందని ఆశ. కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన కొందరు కాంగ్రెస్ నేతలు కూడా దీనికి సుముఖులే. వారికి హైదరాబాద్ నగర ప్రయోజనాలతో పాటు, శ్రీశైలం ప్రాజెక్ట్ నీళ్లు, విద్యుత్‌ల మీద పెత్తనం లభిస్తుంది. అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఈ ప్రతిపాదనకు ప్రధాన వ్యతిరేకి – వైఎస్.జగన్. తనకు పూర్తిగా పట్టున్న రాయలసీమను విడగొడితే రాజకీయంగా నష్టమని భయం. ఆధిపత్యం పలచనైపోయి, రెండు రాష్ట్రాలలోనూ బలహీనంగా మారిపోవలసి వస్తుంది. అందువల్లనే అందరికంటే ముందుగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఈ ప్రతిపాదన నిరసిస్తూ రాజీనామా అస్త్రం ప్రయోగిస్తున్నారు.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

లడ్డూ ప్రసాదాల అమ్మకం ద్వారా 8,06,820 రూపాయలొచ్చాయని దేవస్థానం కార్యనిర్వహణాధి కారి రవీంద్రరెడ్డి చెప్పారు. ఈ మొత్తాలను ఆంధ్ర ప్రగతి బ్యాంక్‌లో డిపాజిట్ చేసామన్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది వెంగమాంబ దేవస్థానం ఆదా యం ఏడు లక్షల రూపాయలు పెరగడం విశేషం.

ఇరకం సర్పంచ్ కుర్చీ రూ.10 లక్షలు!

పంచాయితీ ఎన్నికల సందర్భంగా సర్పంచ్ కుర్చీల వేలంపాట మొదలయ్యింది. సూళ్లూరుపేట దగ్గరున్న రోడ్డు రవాణా సౌకర్యంలేని గ్రామం ఇర కందీవి సర్పంచ్ కుర్చీని పది లక్షల రూపాయల పాటకు పాడుకొన్నారు. బిసి మహిళ ఈ సర్పంచ్ కుర్చీలో కూర్చొంటారు. 1,256 మంది ఓటర్లున్న ఈ గ్రామంలో గతంలోనూ సర్పంచ్ కుర్చీని వేలం పాట పెట్టారు. ఈ పాటల పరంపర జిల్లాలోని చాలా గ్రామాల్లో కొనసాగుతుంది.

జరిగేది ధ్వంసమే

మొదటి పేజీ కొరవ

వచ్చు. రాయల తెలంగాణకు కాంగ్రెస్‌లోని ఒక వర్గం, మజ్లిస్ పార్టీల మద్దతు వుంది. ఉమ్మడి రాజ ధానికి ఆంధ్ర ప్రాంతం నేతల ఆమోదం సులభం.

అయితే నిర్ణయం ఏదైనా రాష్ట్రం తగలబడి పోవడం ఖాయం. వైఎస్‌జగన్ రాష్ట్ర విభజనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాడు. ఆయా పార్టీలు సమై క్యాంధ్ర పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభిం చడం ఖాయం. తెలంగాణ ఇవ్వడం కుదరదని చెప్తే, ఆ ప్రాంతంలో ప్రశాంతత కనుమరుగై పోతుంది. ఇవ్వటివరకు జరిగిన ఉద్యమం వేరు, ఎన్నికల ముందు రాష్ట్ర విభజన లేదని తెలిసిన తర్వాత జరగబోయే ఉద్యమం వేరు. అది అరాచకమ యంగా మారినా ఆశ్చర్యం లేదు. తెలంగాణ ఇస్తే ఆంధ్రలో, ఇవ్వకుంటే తెలంగాణలో ఉవ్వెత్తున ఆందోళనలు చెల రేగుతాయి. వాటిని అదుపు చేసే సామర్థ్యం బహుశా కిరణ్ సర్కారుకు లేకపోవచ్చు. రాష్ట్రపతి పాలన, కేంద్ర సైనికుల పహారాలో రాష్ట్రం చాలా కాలం ప్రగ్గక తప్పదు. ఇదంత శ్రేయస్కరం కాదు.

పాపకన్ను శశిధర్‌రెడ్డి మృతి

రాపూరు మండలంలో రాజకీయంగా ఒక వెలుగు వెలిగిన దివంగత పాపకన్ను జయచంద్రా రెడ్డి రెండవ కుమారుడు, మాజీ ఎమ్పీటిసి సభ్యుడు పాపకన్ను శశిధర్‌రెడ్డి(43) జులై 8న మృతి చెం దారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న శశి మండలంలో చురుకైన నేతగా గుర్తింపు పొం దాడు. అందరితో స్నేహంగా వుంటూ మంచి పేరు తెచ్చుకొన్న ఆయన్ను అనారోగ్యం రూపేణా మృత్యువు కబళించడం బాధాకరం. శశిధర్‌రెడ్డికి భార్య, కుమా రుడు, కుమార్తె వున్నారు. కుటుంబ పెద్దను కోల్పో యిన వారి కుటుంబ సభ్యులకు మా సానుభూతి.

జనవాణి

2వ పేజీ కొరవ

ఇవ్వడం, ముస్లిం బాలికలకు మాత్రమే సైకిళ్లు అంద చేయడం, మత విద్యను మాత్రమే బోధించే మదర సాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులివ్వడం, వారి వివాహాల ఖర్చులకు ఖజనా ధనాన్ని ఖర్చు చేయడం, ఇలాంటి విషయలన్నీ ఒక వర్గంలో నిరుత్సాహా నికి దారితీస్తాయన్నది సుస్పష్టం. ఈ దేశసనాతన ధర్మాన్ని, సంస్కృతీ సాంప్రదాయాల గూర్చి ప్రచారం చేసే హిందూత్వ సంస్థలను మతోన్మాద సంస్థ లంటూ బురద జల్లే నాయకులకు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సాగే మతతత్వపాలన గుర్తుకు రాలేదా? కళ్లు చెవులుండీ కూడా గుడ్డి చెవిటి వాళ్లుగా నటిస్తున్నారా?

సూరిశెట్టి పురుషోత్తం నెల్లూరు

చార్‌ధామ్‌ను కళ్లకు కట్టారు!

జూన్ 28వతేది 'జమీన్‌రైతు' సంచికలో ఉత్తరా ఖండ్‌లోని చార్‌ధామ్‌లో జరిగిన ఉత్పాతాన్ని గూర్చి సంపాదకులు నెల్లూరు డోలేంద్ర ప్రసాద్ వ్రాసిన కథ నం అద్భుతంగా వుంది. కేరళలోని కాలడిలో జన్మిం చిన శంకరాచార్యులు పాదచారిగా రహదారులు లేని ఆరోజుల్లో దేశవ్యాప్తంగా తిరిగిన తీరు, బదరీనాథ్‌కు వెళ్లి ఆలయాన్ని కట్టించి స్వర్గానికి ఇక్కడ నుంచి వెళ్లిన విధానంపై వ్రాసిన వివరాలు అద్భుతంగా ఉన్నాయి. ఎన్ని పత్రికలు, ఛానళ్లలో ఉత్తరాఖండ్ భీభత్స వార్తలు చదివినా 'జమీన్‌రైతు'లో మాదిరి పండువలచి పెట్టినట్లు దేనిలోనూ రాలేదనాలి.

వాస్తు రామచంద్ర నెల్లూరు


మండిపోతున్న ధరలు!

సామాన్యుడు ఏంకొని తినలేని పరిస్థితులు నేడున్నాయి. నెల్లూరు మార్కెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటి ఉన్నాయి. టమోటాలు కిలో 50–60 రూపాయల మధ్య అమ్ముతున్నారు. అల్లం 250 రూపాయలు. వంకాయలు, బెండకాయలు, చామగడ్డలు, క్యారెట్, బీట్‌రూట్ వంటివన్నీ కిలో 50రూపాయలకే అమ్ము తున్నారు. నెల్లూరీయులు ఎక్కువగా తినే జిలకరి మసూరి రకం బియ్యం కిలో 50రూపాయల పైన ధర పలుకుతున్నాయి. కందిపప్పు, మినపప్పు, పెసల పప్పు అన్నిరకాల నూనెల ధరలు కూడా పెరిగిపో యాయి. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో నికి తేను రాష్ట్రప్రభుత్వం ఓ కార్యచరణను ప్రకటిం చాల్సి ఉంది.

ఎస్.సువర్చల నెల్లూరు

పదరంగం -75

నిర్వహణ : బాబాజీ



అడ్డం

1. చోదనము చేయువాడు సారధి (4)
4. ఆదివారం తర్వాత? (4)
7. ఆంజనేయుడు (3)
8. తెలుగు రూము (2)
9. అటునుంచి దొంగిలింపబడ్డది (3)
10. మనసులో మెదలిన ఉద్దేశ్యం (4)
11. చిత్తరువు, రామోజీరావు సినిమా (2)
12. బంగారం (3)
14. అటునుంచి ఆశకు వ్యతిరేకం (3)
16. యౌవనము (3)
17. నాయకత్వం వహించేవాడు (4)
18. మనసు, ఎడద (3)
19. తోక తెగిన అదను (2)
20. అటునుంచి మొదలు, వారంలో మొదటిరోజు పేరు (2)
23. జొన్న పొత్తు (4)
25. అటునుంచి నీరు (2)
27. ప్రైమ్ మినిష్టర్ (3)
28. శోభించునది (4)
29. జంట (2)
30. పిదప, తర్వాత (4)

నిలువు

1. వింత (2)
2. అవివాహిత (3)
3. క్రింద నుంచే దొంగ (3)
5. ఈలోకం కాదు (4)
6. క్రింద నుంచి పట్టణం (3)
9. మంత్రం కాదు (2)
10. ఆజ్ఞ, ఒట్టు (2)
11. అడ్రసు (2)
12. ప్రసవించి, చూచి (2)
13. అంతం కాదిది... (3)
14. బయలుదేరుతుంటే ఎదురు వచ్చేది (3)
15. రాకుండా ఉండే పనైతే... ఆ మాటే చెప్పండి! (2)
16. చంద్రిక, వెన్నెల, ఎమ్మెస్ రెడ్డి గారి బ్యానరు (3)
18. నీరు (3)
19. క్షుద్బాధను తొలగించే దానం (4)
21. మొదటి నుంచి చివరి వరకు (4)
22. బ్రహ్మ, విధిని లిఖించువాడు (3)
24. పిల్ల, కిశోర ప్రాయంలో కలది (3)
26. సర్పము (2)
27. ప్రజలు క్లుప్తంగా (2)

సమాధానాలు

పదరంగం -74

1శి	2రో	ధా	3ర్యం		4ఆ	5లో	చ	6న	7లు
	ద		8కా	ల	క్షో	పం		9ఆ	మ్మ
10మ	న	11వి			ప		12లు		కా
		శా		13అ	ణ	కు	వ		
14స	15క	లం		వ			16ట	17దో	పూ
18మ	న్ను		19అ	ధి	20కు	డు		సె	
రం		21త	ల్లి		శ				22శు
	23ఎ	రు	క		24లం	25ది	26ప		న
27బీ	రు	వా		28ది		29న	ది		క
30డు	వు	త		31శ	త	ము		32పా	ము

గిన్నీస్‌బుక్‌లో ఎక్కిన తెలుగు సినీ ప్రముఖులు!

వందేళ్ల సినిమాకు వందనం

జయంపు కృష్ణ

గతవారం కొరవ

1921లో అక్టోబర్ 23న విజయవాడలో పోతిన శ్రీనివాసరావుగారు మారుతి సినిమా పేరుతో ఒక థియేటర్ స్థాపించాడు. అందువల్ల ఆయన రాష్ట్రంలో తొలి సినిమా థియేటర్ వ్యవస్థాపకుడిగా పేరుపొందాడు. సినిమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడానికి 1934లో జి.కె.మంగరాజుగారు పంపిణీ(డిస్ట్రిబ్యూషన్) వ్యవస్థను మొదటిసారిగా నెలకొల్పారు. ఆ సంస్థ ఆ తర్వాత "పూర్ణా పిక్చర్స్"గా ప్రసిద్ధమయ్యింది.

సినిమాల్లో ప్రయోగాలు

సినిమాలు వరుసగా తయారవ్వ సాగాయి. వాటి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అయితే తర్వాత దశకంలో సినిమాల్లో ప్రయోగాలు చోటుచేసుకొన్నాయి. 1938లోనే సమాజంలోని కులమత భేదాలను నిరసిస్తూ గూడవల్లి రామబ్రహ్మం గారు 'మాలపిల్ల' చిత్రాన్ని రూపొందించారు. అలాగే ఆయన రైతు సమస్యలను ప్రస్తావిస్తూ 'రైతుబిడ్డ' చిత్రాన్ని తీశారు. వీటికి ప్రభుత్వ ఆదరణ లభించలేదు కానీ ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు.

1940లో తెలుగు నవల ఆధారంగా మొక్కపాటి నరసింహశాస్త్రి 'బారిస్టర్ పార్వతీశం' చిత్రం, అలాగే శరత్, ప్రేమచంద్, టాగూర్, కిషన్ చందర్ రచనల ఆధారంగా కూడా తెలుగులో చిత్రాలు వచ్చాయి. ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైనవిగా సినిమా పండితులు పది చిత్రాలను ఎంపిక చేశారు. ఆ జాబితాలో సుప్రసిద్ధ దర్శకుడు సత్యజిత్‌రామ్ తీసిన 'పథేర్ పాంచాలి' బెంగాలీ చిత్రం ఎంపికై మన భారత చిత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టింది. ఆ చిత్రం 'విభూతి భూషణ్ బెనర్జీ' రచించిన పథేర్ పాంచాలి అన్న నవల ఆధారంగా తయారయింది.

ఇక్కడ నేనో విషయం చెప్పుకోవలసి వుంది. 1974-75లలో నేను మదరాసులో డాక్టర్ ఎమ్మెస్‌రెడ్డి గారు కౌముదీ పిక్చర్స్ సంస్థలో డైరక్షన్ డిపార్టుమెంటులో పనిచేస్తూ వున్నాను. నా తొలి చిత్రం 'ముత్యాల పల్లకి' పాటల రికార్డింగ్ కని ప్రసాద్ స్టూడియోకి వెళ్లడం జరిగింది. అక్కడికి ఆ రోజు ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడు సత్యజిత్ రామ్ వస్తున్నట్లు తెలిసి ఆయన్ను కలుసుకోవాలని వెళ్లాను. ఆయన సింపుల్‌గా స్టూడియోకి వచ్చారు. నేను దగ్గరికెళ్లి నమస్కరిస్తూ పరిచయం చేసుకున్నాను. వారు ప్రసన్నులయ్యారు. ఆయన ప్రఖ్యాత కూచిపూడి నర్తకి బాల త్రిపుర సుందరీ దేవిపై డాక్యుమెంటరీ తీసే పనిమీద వచ్చారు. దానికి నేను అంప్రంటీస్‌గా పని చేస్తానని అడిగాను. వారు సంతోషంగా అందుకు అంగీకరించడం, షూటింగ్ జరిగిన ఆ మూడు రోజులు నేను వారి అసిస్టెంట్‌గా పనిచేయడం నిజంగా నా అదృష్టం. అది ఒక మరచిపోలేని మధుర జ్ఞాపకం. అలాగే మా సంస్థ 'నాయుడుబావ' చిత్రం తెరకెక్కిస్తున్నప్పుడు రాజ్యలక్ష్మి ఎడిటింగ్ రూమ్స్‌లో బెంగాలీ యువ దర్శకుడు గౌతమ్ ఘోష్‌తో పరిచయం మరువలేనిది. 'మా భూమి' చిత్రం వారు తీస్తూ ఎడిటింగ్‌కు అక్కడకు వచ్చే వారు. వారి సౌహార్థత అమోఘం, అద్వితీయం. అలా సాహిత్యానికి, సినిమాకు లింకు కుదిరింది. దక్షిణాదికి మొదటిసారి బంగారు పతకం దక్కించుకున్న 'చెమ్మీన్' అనే మళయాళీ చిత్రం తకళి శివశంకరపిళ్లై నవల ఆధారంగా తయారయిందే.

పల్లెటూరు పిల్ల, రాజు - పేద, బంగారు పాప, పెద్ద మనుషులు, గుణసుందరి కథ, బీదల పాట్లు వంటి పలు చిత్రాలు ఇంగ్లీషు రచనల ఆధారంగా తెలుగు వాతావరణానికి అనుకూలంగా మలచి తీసినవే. అలా నవలా సాహిత్యం కూడా తెలుగు సినిమాలకు పరిపుష్టిని చేకూర్చాయి.

మహిళా దర్శకులు


మగవాళ్లే కాదు మహిళలు కూడా ఎందులోనైనా రాణించగలరు అన్నది సినిమా రంగంలో కూడా నిజం చేశారు. 1953లో భానుమతి 'చండీరాణి' అనే చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రూపొందించారు. అలా తెలుగులో తొలి మహిళా దర్శకురాలిగా భానుమతి వాసికెక్కారు. 1968లో జి.వరలక్ష్మి "మూగ జీవాలు" అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. నటి సావిత్రి అదే సంవత్సరం చిన్నారి పాపలు, చిరంజీవి, మాతృదేవత అనే చిత్రాలను డైరెక్ట్ చేశారు. అలాగే విజయనిర్మల మొదట మళయాళంలో 'కవిత'అనే చిత్రాన్ని డైరక్ట్‌చేసి 'మీనా'తో తెలుగు ప్రేక్షకులకు దర్శకురాలిగా పరిచయమయ్యారు. అంతేకాదు అత్యధిక చిత్ర దర్శకురాలిగా ఖ్యాతి వహించి గిన్నీస్ బుక్‌లో స్థానం సంపాదించుకున్నారు. అలా మహిళా దర్శకుల జాబితాలో లక్ష్మి, రేవతి, బి.జయ, సుచిత్రా చంద్రబోస్, నందినీరెడ్డి చోటు పొందారు.

గిన్నీస్ బుక్‌లో మరి కొంత మంది

దర్శకురాలిగా విజయ నిర్మలతోపాటుగా అత్యధిక చిత్రాల నిర్మాతగా డాక్టర్ డి.రామానాయుడు, అత్యధిక చిత్ర దర్శకుడిగా డాక్టర్ దాసరి నారాయణరావు, ఒకే భాషలో అత్యధిక చిత్రాల నటుడిగా బ్రహ్మానందం, అత్యధిక పాటలు పాడిన గాయకునిగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గిన్నీస్ బుక్‌లో స్థానం సంపాదించుకోవడం విశేషం. ఇవన్నీ చాలా గొప్ప విషయాలు.

చిత్ర నిర్మాణం అనన్య సామాన్యం!

ఒక చిత్ర నిర్మాణం జరగాలంటే యానిమేషన్‌తో సహా దాదాపు 25 విభాగాలు పనిచేయవలసి వుంటుంది. వీటన్నింటికీ దర్శకుడు కెప్టెన్‌లా వ్యవహరించాలి. నిర్మాత వెన్నుదన్నులుండాలి. అయితే ఒక చిత్రం విజయరహస్యం మాత్రం యిప్పటికీ ఒక బ్రహ్మరహస్యంగానే మిగిలిపోయింది. అలాంటి అపూర్వ చరిత్ర గలిగిన ఈ మహోత్కృష్ట పరిశ్రమలో 'నేనుసైతం' అన్నట్లు 'రామబాణం' అనే ఒక చిత్రానికి కథరాసి, ఆ చరిత్రలో ఒక అక్షరాన్నయినందుకు అదృష్టంగా భావిస్తున్నాను. ఇప్పటికీ అదే పరిశ్రమలో పరిశ్రమిస్తున్నందుకు ఆనందిస్తున్నాను. వందేళ్ల సినిమాకు వంద వందనాలు సమర్పిస్తున్నాను.



రైతు లోకం

వివిధ పంటలలో సమస్యలు - నివారణ!

డాక్టర్ కె.పుల్లంరాజు
కోఆర్డినేటర్,
ఏరువాక (డాట్ సెంటర్), నెల్లూరు.

మన జిల్లాలో ప్రస్తుతం సాగులో వున్న వివిధ పంటలలో అక్కడక్కడ ఈ క్రింది సమస్యలు కనపడుతున్నాయి. కాబట్టి రైతులు క్రింద తెలిపిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిది.

వరిలో కాండం తొలుచు పురుగు

ఈ పురుగు ఆశించిన మొవ్వులు చనిపోతున్నప్పుడు అసిఫేట్ 1.5 గ్రాములు లేక కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

ఆకునల్లి

దుబ్బు దశలో వున్న వరిలో ఆకునల్లి ఆశించిన ఎడల ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు లేక డైకోఫాల్ 5 మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

ప్రత్తిలో రసం పీల్చు పురుగులు

పచ్చదోమ, తామర పురుగులు ఆశించినట్లు గమనించిన ఎడల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4 మిల్లీలీటర్లు లేక అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

వేరుశనగలో రసం పీల్చు పురుగులు

పచ్చదోమ, తామర పురుగులు ఆశించినట్లయితే మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేక ఇమిడాక్లోప్రిడ్ 0.4 మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు

కాండం తొలుచు పురుగు ఆశించినచో మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి లేక కార్బోప్యురాన్ 3జి గుళికలు ఎకరాకు 3కిలోల చొప్పున ఆకు సుడులలో వేసి నివారించుకోవచ్చు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

సమస్యలూ నాలుగే!

- కృష్ణ, గోదావరి నీళ్లు
- సింగరేణి బొగ్గు, విద్యుత్
- హైదరాబాద్ ఆస్తులు, ఉద్యోగాలు
- నక్సలైట్ల విజృంభణ

నదులు అక్కడ, సాగు ఇక్కడ

భౌగోళికంగా తెలంగాణ ప్రాంతం దక్కన్ పీఠభూమిలో నెలకొని వుంది. సముద్ర మట్టానికి 500 నుంచి 700 అడుగుల ఎత్తు వరకు పరచుకొని వుంది. మన రాష్ట్రానికి ప్రధాన జలవనరులైన గోదావరి, కృష్ణ నదులు ఈ ప్రాంతం మీదుగానే ప్రవహిస్తున్నాయి. అయితే ఆ నీళ్ల ఉపయోగం తెలంగాణ కంటే ఆంధ్ర జిల్లాలకే ఎక్కువ. ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి సరిహద్దు వరకు గోదావరిలో నీళ్లుండవు. అందువల్లనే గోదావరికి వరద వచ్చినా, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో తడి కన్పించదు. ఆదిలాబాద్, ఛత్తీస్‌ఘడ్ అడవులలో పుట్టే ప్రాణహిత, మంజీర, ప్రవర, పెన్‌గంగ, వైగంగ, ఇంద్రావతి, బిందుసార, శబరి వంటి ఉపనదుల వల్లనే గోదావరికి నీరు వస్తుంది. కానీ ఈ నీరు తెలంగాణకు ఉపయోగపడదు. అందుకు కారణం – నదికి, నేలకు మధ్య ఆరేడు వందల అడుగుల ఎత్తు కలిగి వుండడం. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా మాత్రమే గోదావరిని వాడుకోవాలి. అది ఖర్చుతో కూడిన పని. అంత కరెంట్ మన వద్ద లేదు. ఉన్నా సాగుతో వచ్చే లాభం కంటే కరెంట్ బిల్లుల ఖర్చు ఎక్కువ.

కృష్ణా నది పరిస్థితి కూడా అంతే. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లకు ఒకవైపు తెలంగాణ, మరొకవైపు ఆంధ్రా జిల్లాలున్నాయి. కానీ శ్రీశైలం, జూరాల నుంచి తెలంగాణకు నీరు పారించాలంటే కొండలలో సొరంగాలు త్రవ్వడం తప్ప వేరే మార్గం లేదు. అదే ఆంధ్రకు మాత్రం పోతిరెడ్డిపాడు వంటి సాధారణ రెగ్యులేటర్ల ద్వారా నీరు ప్రవహిస్తుంది. ఒక్క నాగార్జునసాగర్ నుంచి మాత్రమే ఖమ్మం జిల్లాకు సాగు లాభం కల్పించాడు జలగం వెంగళరావు. కృష్ణ నది నికర జలాలలో ఆంధ్ర వాటా తొంభై శాతం. తెలంగాణ భాగం నామ మాత్రమే.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే అటు గోదావరి, ఇటు కృష్ణ జలాల మీద తమకున్న రైపేరియన్ హక్కు హరించుక పోతుందని, వారు ప్రాజెక్ట్‌లు కట్టుకొని నీరు తరలించుకొని పోతారని ఆంధ్రా ప్రాంతం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు ఇదే పని చేయడాన్ని ఉదాహరణగా చూపుతున్నారు. ఆల్మట్టి ప్రాజెక్ట్ వల్ల కృష్ణా డెల్టాలో సాగు దైఎధీనంగా మారిపోవడం కళ్ల ముందు కన్పిస్తూనే వుంది. గోదావరిలో వరద సమయంలో కావాల్సినన్ని నీళ్లుంటాయి. దాని ద్వారా సముద్రానికి వెళ్లే నీటిని వాడుకోగల్గితే మొత్తం దక్షిణ భారత దేశంలో కరువు అన్నది లేకుండా చేయవచ్చు. దాదాపు నాలుగు వేల టిఎంసిల నీళ్లు సముద్రంలో కలుస్తాయి. అయితే వర్షాభావ సమయంలో మాత్రం తెలంగాణ ప్రాంతంలో నిర్మాణంలో వున్న ఎల్లంపల్లి, కంతనపల్లి, భూపాల్‌పల్లి, ప్రాణహిత – చేవెళ్ల వంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల ద్వారా నీటిని తరలిస్తే, ఉభయగోదావరి జిల్లాలు కరువుతో అల్లాడక తప్పదు.

కృష్ణా నది వరద నీటి ఆధారంగా సోమశిల, తెలుగుగంగ, బ్రహ్మంగారి మఠం, జమ్మలమడుగు, హంద్రీ నీవా, శ్రీశైలం బ్రాంచ్ కాలువల వంటి నీటిపారుదల ప్రాజెక్ట్‌లు ఆధారపడి వున్నాయి. రాయలసీమ మీద తనకున్న అభిమానాన్ని చాటుకోవడానికి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని నాలుగు వేల క్యూసెక్కుల నుంచి నలభై వేల క్యూసెక్కులకు పెంచాడు. కృష్ణకు వరద అంటూ వస్తే, క్షణాలలో భారీ నీటి ప్రవాహం కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలకు తరలి వస్తుంది దీని వల్ల. అదే సమయంలో అటు మహబూబ్‌నగర్, నల్గొండల వైపు నిర్మించిన నీటి సొరంగాలను మాత్రం నాలుగు వేల క్యూసెక్కుల లోపలకు డిజైన్ చేశారు. అంటే, వరద వచ్చినా తెలంగాణ జిల్లాలకు పెద్దగా ప్రయోజనం వుండదన్న మాట. ప్రత్యేక రాష్ట్రం అంటూ ఏర్పడితే వారు కూడా పోతిరెడ్డిపాడు స్థాయిలో సొరంగాలు నిర్మించుకొంటారు. వరద నీటిని తరలించుకపోతారు. దానివల్ల రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు నష్టం జరుగుతుంది.

గోదావరికి సంబంధించి మరొక సమస్య – పోలవరం. ఈ ప్రాజెక్ట్ ఉద్దేశ్యం గోదావరి నీటిని కృష్ణా నదికి తరలించడం. కృష్ణా నది మీద ఎగువ ప్రాంతాలలో కట్టిన ప్రాజెక్ట్‌ల వల్ల డెల్టా ప్రాంతం మొత్తం సమస్యలు ఎదుర్కొంటున్నది. వరద వస్తే తప్ప నీరు రావడం లేదు. కృష్ణకు నాలుగేళ్లకు ఒక సారి మాత్రమే సరాసరిన వరద వచ్చే అవకాశం వుంది. గోదావరిలో పుష్కలంగా వున్న నీటిని పోలవరం ప్రాజెక్ట్ ద్వారా కృష్ణా నదికి తరలిస్తే కరువు సమస్య తొలగిపోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు తెలంగాణ వ్యతిరేకి. దీనివల్ల తెలంగాణ భూములు మునుగుతాయే తప్ప వారికి చిన్నపాటి ప్రయోజనం కూడా లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే పోలవరం నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం వుంది.

బొగ్గు వారిది, విద్యుత్ మనది

తెలంగాణ ప్రాంతం సహజ వనరుల గని. అందులో సింగరేణి బొగ్గు ప్రధానమైనది. మన రాష్ట్రంలోని విజయవాడ, ముద్దనూరు, పర్వాడ తదితర థర్మల్ విద్యుత్ కేంద్రాలన్నీ సింగరేణి బొగ్గు మీదే ఆధారపడి వున్నాయి. రామగుండం, కొత్తగూడెంలలో కూడా థర్మల్ విద్యుత్ కేంద్రాలున్నప్పటికీ, అక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో కొద్ది భాగాన్ని మాత్రమే మన రాష్ట్రానికి కేటాయిస్తున్నది ఎన్‌టిపిసి. తతిమాదంతా జాతీయ గ్రిడ్‌కు కలిపి వేస్తున్నది.

సింగరేణి పూర్తిగా రాష్ట్ర నియంత్రణలోని సహజ వనరు. జార్ఖండ్, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలలో వున్న బొగ్గు గనులను కోల్ ఇండియా ఆధ్వర్యంలో కేంద్రమే నియంత్రిస్తున్నది. అందువల్ల తెలంగాణ ఏర్పడితే సింగరేణి బొగ్గును ముందుగా తమ అవసరాలకే వాడుకోవడం సహజం. అప్పుడు విటిపిఎస్, ఆర్‌టిపిఎస్ వంటి విద్యుత్

కొరవ 14వ పేజీలో

ఆంధ్రకు వచ్చే నష్టం ఏమిటి?


రాష్ట్రం రెండుగా విభజిస్తే ఆంధ్ర ప్రాంతానికి వచ్చే నష్టం ఏమిటి? నలభై ఏళ్ల క్రితం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని ఉవ్వెత్తున ఉద్యమం నడిచింది. ఇందిరాగాంధీ ఉక్కు పాదంతో అణచబట్టి సరిపోయింది కానీ లేకుంటే అప్పుడే రాష్ట్రం రెండు ముక్కలై వుండేది. అయితే అప్పటికి, ఇప్పటికి రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులలో పెను మార్పులు వచ్చాయి. వాటి నేపథ్యంలో రాష్ట్ర విభజన వల్ల ఆంధ్ర ప్రాంతానికి లాభమా నష్టమా అన్న బేరీజు వేసుకోవాలి.

హైదరాబాద్ రాజధానిగా కోల్పోతే ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి ఫలాలు అందకుండా పోతాయన్నది మొదటి అభ్యంతరం. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను సమకూర్చు కొన్నది. ఆ స్థాయిలో కొత్త రాజధాని కట్టుకోవాలంటే లక్షల కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి. చాలా సమయం కూడా పడుతుంది. అన్ని వసతులు వున్న రాజధాని వదలుకొని కొత్తదాని కోసం పాట్లు పడడం ఎందుకన్నది ప్రశ్న. అయితే నిర్మాణ రంగంలో వచ్చిన విప్లవాత్మక విజ్ఞానాభివృద్ధి వల్ల భవన నిర్మాణం చాలా త్వరితంగా జరిగిపోతున్నదిప్పుడు. చండీఘడ్ వలె మనమూ కొత్త రాజధాని అభివృద్ధి చేసుకోవడానికి పది పన్నెండేళ్లకు మించి సమయం పట్టకపోవచ్చు. పైగా అంతా కొత్త కాబట్టి, సింగపూర్ వంటి నగరాన్ని నిర్మించుకోవచ్చు.

ఆంధ్ర ప్రాంతానికి వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం వుంది. ఎన్ని ఓడరేవులైనా కట్టుకోవచ్చు. పారిశ్రామిక ప్రగతికి ఓడరేవులు చాలా కీలకం. రవాణా ఖర్చుల ఆదా కావడం వల్ల ఓడరేవులున్న చోటే పరిశ్రమలు ఏర్పడతాయి. పైపెచ్చు కృష్ణ, గోదావరి బేసిన్‌లో పుష్కలంగా సహజ వాయువు నిల్వలున్నాయి. దానితో ఎరువులు, విద్యుత్, పెట్రో అల్లాయ్, ఫౌండరీలు వంటి ఇంధన వినియోగం ఎక్కువగా వుండే భారీ పరిశ్రమలు నెలకొల్పుకోవచ్చు. ఆంధ్ర ప్రాంతంలో విస్తృతమైన రోడ్డు, రైలు రవాణా వ్యవస్థ వుంది. ఆంధ్ర ప్రాంతం ప్రజలలో ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపార తపన కూడా ఎక్కువ. అందువల్ల సరైన వసతులు కల్పిస్తే ఆంధ్ర రాష్ట్రం పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. హైదరాబాద్‌తో నష్టపోయే ఆస్తుల విలువ పదేళ్లలో ఇక్కడే సమకూరుతుంది.

కృష్ణ, గోదావరి డెల్టా ప్రాంతాలు, కరువు సీమ అయిన రాయలసీమకు నీటి సమస్య వస్తుందన్నది పెద్ద భయం. అయితే రాష్ట్ర విభజన ఒప్పందాలలో నీటి పంపకం పై స్పష్టమైన అంగీకారం కుదుర్చుకొని, రైపేరియన్ రైట్స్‌కు భంగం కల్గని రీతిలో అవగాహన ఏర్పరచుకొని, కేంద్ర నియంత్రణకు అప్పచెప్తే ఈ సమస్యను కొంతవరకు అధిగమించవచ్చు. ఒక్క పోలవరం ప్రాజెక్ట్ చాలు – మన నీటి అవసరాలు తీర్చడానికి.

ఒకే భాష మాట్లాడే ప్రజలు ఒకే రాష్ట్రంలో వుండడం న్యాయం అన్నది ఒక సమంజసమైన వాదనే. కానీ హిందీ మాట్లాడే ప్రజలకు డజనుకు పైగా రాష్ట్రాలున్నప్పుడు తెలుగు మాట్లాడే వారికి రెండు రాష్ట్రాలుంటే వచ్చే నష్టం ఏమి వుంటుంది? పైగా భాష ఒక్కటే అయినప్పటికీ తెలంగాణ, ఆంధ్ర సంస్కృతుల మధ్య హస్తి మస్తకాంతరం వుంది. రెండు ప్రాంతాల ప్రజల సాంప్రదాయాలు, పండుగలు, కళా రూపాలు, ఆచార వ్యవహారాలు భిన్నం. ఎవరి సంస్కృతిని వారు పరిరక్షించుకొనే అవకాశం వస్తుంది.



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com